


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 262, పేజీలు - 08

మంగళవారం, మార్చి 10, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ఒలింపిక్స్ లక్ష్యంగా
# క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలి

### - యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- మెగా ఈవెంట్లలో పతకాలు సాధించడమే లక్ష్యమన్న సీఎం
- యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీని సిద్ధం చేయాలని ఆదేశం
- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ఉండాలన్న రేవంత్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా తెలంగాణలో అన్ని సౌకర్యాలతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఒలింపిక్స్, కామన్‌వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యమిచ్చేలా, ఒలంపిక్స్‌లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటడమే లక్ష్యంగా క్రీడా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. క్రీడలకు అవసరమైన మైదానాలు, యూనివర్సిటీ, శిక్షణ తదితర అంశాలపై క్రీడాశాఖకు సంబంధించి ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. రాష్ట్రంలో తలపెట్టిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన మైదానాలతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడంపై చర్చించారు. ఈ సందర్భంగా నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు.

**-గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియంను పునరుద్ధరించాం**

'గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియంను పునరుద్ధరించడంతో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలి'అని సీఎం ఆదేశించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్‌నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, క్రీడాకారులకు శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి సైతం పాల్గొన్నారు.

**- ప్రభుత్వానికి మద్దతుగా నిలబడండి**

'హైదరాబాద్ అత్యంత పురాతన, ప్రాముఖ్యత కలిగిన నగరం. ఆ ప్రాభవం కోల్పోయే ప్రమాదం ఉంది. దీన్ని ఒక సుందరమైన నగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో పనిచేస్తున్నాం. బతుకమ్మ కుంటను అభివృద్ధి చేశాం. ఏడాది కిందట బుమ్-రుక్న్-ఉద్-దౌలా చెరువు ఎలా ఉంది. ఇప్పుడేలా ఉంది'అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. 'ఈ ఒరిజినల్ సిటీని అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రస్తుతం కొనసాగుతున్న పనులను చూడండి. ఆ పనులను చూసి ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముస్లిం సోదర సోదరీమణులకు ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ఎంపీలు అసదుద్దీన్



ఓవైసీ,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌తో పాటు ప్రజా ప్రతినిధులు, ఉన్నధికారులు పాల్గొన్నారు.

**- ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026ను ప్రారంభించిన సీఎం రేవంత్**

హైదరాబాద్ గచ్చిబౌలి జీఎంసీ బాలయోగి స్టేడియంలో ప్రతిష్టాత్మక మహిళల ఎఫ్ఐహెచ్ హాకీ వరల్డ్ కప్ 2026 క్వాలిఫయర్స్ టోర్నమెంట్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. భారత్‌కు ఉరుగ్వే టీమ్‌కు మధ్య మ్యాచ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. వచ్చే ఆగస్టులో బెల్జియం, నెదర్లాండ్స్‌లో జరగనున్న ప్రపంచ హాకీ కప్ కోసం క్వాలిఫయర్స్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు జరగనున్న ఈ క్వాలిఫైయింగ్ మ్యాచ్ టోర్నమెంట్‌లో 8 దేశాలు పాల్గొంటున్నాయి. గ్రూప్ - ఏ లో ఆస్ట్రియా, ఇంగ్లండ్, ఇటలీ, కొరియా దేశాలు, గ్రూప్ - బీ లో ఇండియా, స్కాట్‌లాండ్, ఉరుగ్వే, వేల్స్ జట్లు పాల్గొంటున్నాయి. ఈ ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు మంత్రులు వాకిటి శ్రీహరి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ఇరాన్ యుద్ధం.. 67 వేల మంది
# భారతీయులు స్వదేశానికి

### - రాజ్యసభలో కీలక ప్రకటన చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి నుంచి ఇప్పటివరకు 67,000 మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు. ఇవాళ ఆయన రాజ్యసభలో పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై ఒక ప్రకటన చేశారు. సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ, భారతీయుల భద్రతకు, వారిని వెనక్కి తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లోని గగనతలాన్ని పాక్షికంగా తెరిచిన ప్రతీసారి, వాణిజ్య విమానాలతో పాటు ప్రత్యేక విమానాల ద్వారా భారతీయులను వెనక్కి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ నాటికి ఈ సంఖ్య 67,000కు చేరిందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించడం గమనార్హం. వారి నిరసనల మధ్యే జైశంకర్ తన ప్రకటనను పూర్తి చేశారు.

ఇరాన్‌లో ఉద్రిక్తతలు పెరగడంతో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి విద్యార్థులకు, ఇతర పౌరులకు సహాయం అందించడానికి చర్యలు తీసుకుందని జైశంకర్ వివరించారు. పలువురు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. వ్యాపార నిమిత్తం ఇరాన్‌లో ఉన్న భారతీయులు, పొరుగున ఉన్న అర్మేనియాకు వెళ్లి అక్కడి నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. టెహ్రాన్‌లోని ఎంబసీ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని, అత్యంత అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలోని పరిణామాలను ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని జైశంకర్ సభకు తెలిపారు. యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, ఒమాన్, జోర్డాన్, ఇజ్రాయెల్, బహ్రెయిన్ దేశాధినేతలతో ప్రధాని మాట్లాడారని వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించాలని అన్ని పక్షాలను కోరుతున్నామని చెప్పారు. తాను కూడా ఆయా దేశాల విదేశాంగ మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. భారత సమాజం భద్రత, సంక్షేమానికి తమ దేశాలు ప్రాధాన్యతనిస్తాయని ఆయా దేశాల నాయకత్వాలు హామీ ఇచ్చాయని తెలిపారు. అమెరికాతో కూడా దౌత్య మార్గాల ద్వారా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆడబిడ్డల కన్నీళ్లు
# మీకు మంచిది కాదు

### - ప్రభుత్వానికి కవిత వార్నింగ్

- వెలుగుమట్ల బాధితుల కోసం రోడ్డెక్కిన కవిత పోరాటం
- ఖమ్మం వెలుగుమట్ల నిర్వాసితులను పరామర్శించిన కవిత
- టూరిస్ట్‌గా రాలేదు, సమస్య పరిష్కారమయ్యేవరకూ పోరాడతానని వెల్లడి
- కూల్చిన చోటే ఇళ్లు కట్టివ్వాలని ప్రభుత్వానికి డిమాండ్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల బాధితుల పక్షాన నిలుస్తూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. నగరంలోని జెడ్పీ సెంటర్ వద్ద బాధితులతో కలిసి ఆమె బైఠాయించడంతో భారీగా నిరసన వ్యక్తమైంది. ఈ సందర్భంగా ఖమ్మం ఆర్డీవో కవితతో చర్చలు జరిపినప్పటికీ, ఆమె తన పట్టు వీడలేదు. జిల్లా కలెక్టర్ స్వయంగా ఇక్కడికి వచ్చి, వెలుగుమట్ల బాధితులకు వారు గతంలో ఉన్న చోటే ఇంటి పట్టాలు మరియు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చే వరకు ఈ ఆందోళన విరమించే ప్రసక్తే లేదని ఆమె తెగేసి చెప్పారు.ఈ సందర్భంగా కవిత స్థానిక మంత్రులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థుల పుస్తకాలతో సహా ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేయడం అత్యంత అమానుషమని ఆమె మండిపడ్డారు. ఒక ఆడబిడ్డ ఏడిస్తేనే ఇంటికి మంచిది కాదు, అలాంటిది ఇంతమంది మహిళల ఆవేదన చూస్తుంటే కడుపు తరుక్కుపోతోంది.

ఈ పేదల ఉసురు ఖచ్చితంగా ప్రభుత్వానికి, రాజకీయ నాయకులకు తగులుతుంది అని ఆమె హెచ్చరించారు.

రాష్ట్రంలో పేదల ఇళ్లపైనే జులుం నడుస్తోందని, పెద్దల భవనాల జోలికి వెళ్లని బుల్డోజర్లు పేదల ఇళ్ల మీదకు రావడం రాజ్యాంగాన్ని కూనీ చేయడమేనని ఆమె విమర్శించారు.గతంలో వెలుగుమట్ల ఇళ్లను కూల్చే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు భోజనాలు, హెల్త్ క్యాంపులు పెడుతూ తమ పాపాలను కడుక్కునే ప్రయత్నం చేస్తోందని కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బాధితుల ఆవేదనను కొన్ని రాజకీయ పార్టీలు కేవలం ఒక ఎగ్జిబిషన్ లా చూసి వెళ్తున్నాయని, కానీ తాను మాత్రం సమస్య పరిష్కారం అయ్యే వరకు ఇక్కడి నుండి కదిలేది లేదని స్పష్టం చేశారు. బాధితులను ఒక కొట్టంలో వేసినట్లు ఇక్కడకు తెచ్చి పడేశారని, కనీసం మహిళలకు కనీస వసతులు కానీ, ఆరోగ్య శిబిరాలు కానీ ఏర్పాటు చేయకపోవడం దారుణమని ధ్వజమెత్తారు.

జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఎవరికీ బాధితుల కష్టాలు పట్టడం లేదని, కనీసం జిల్లా కలెక్టర్ కూడా ఇప్పటి వరకు బాధితులను పరామర్శించకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని కవిత విమర్శించారు. మా డిమాండ్ ఒక్కటే ఎక్కడైతే పేదల ఇళ్లను నేలమట్టం చేశారో, అదే స్థలంలో వారికి కొత్త ఇళ్లు కట్టించి ఇవ్వాలి.

వేరే చోటికి వెళ్లమంటే మేము ఒప్పుకోము అని ఆమె డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీలు, ధర్మ సమాజ్ పార్టీ , ప్రజా సంఘాలతో కలిసి సమగ్ర కార్యాచరణతో ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ఆమె ప్రకటించారు.

# క్యూఆర్ కోడ్ తో పట్టాదారు పాస్‌పుస్తకాలు

### - నంద్యాల జిల్లాలో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ

- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో గత ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం
- కేంద్ర సాయంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపబోమని స్పష్టీకరణ

అమరావతి (ప్రశ్న న్యూస్) నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గంలోని కొత్త బురుజులో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా అస్తవ్యస్తం చేసిందని చంద్రబాబు మండిపడ్డారు. రైతుల భూములను ఇష్టానుసారంగా 22ఏ జాబితాలో పెట్టి వేధించారని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ద్వారా ప్రైవేట్ భూములపై పెత్తనం చలాయించాలని చూశారని విమర్శించారు. తాము అధికారంలోకి రాగానే ఆ నల్ల చట్టాన్ని రద్దు చేసి, భూ రికార్డుల్లోని తప్పులను సరిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. గత పాలకులు పాసుపుస్తకాలు, సర్వే రాళ్లపై ఫోటోలు ముద్రించుకుని ప్రజల జీవితాలతో ఆడుకున్నారని, ఇందుకోసం ఏకంగా రూ.750 కోట్లు వృథా చేశారని చంద్రబాబు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వం ఇచ్చిన 19.93 లక్షల తప్పుడు పుస్తకాలను పక్కనబెట్టి, ఇప్పుడు పక్కాగా క్యూఆర్ కోడ్ , బ్లాక్ చైన్ టెక్నాలజీతో కూడిన ట్యాంపర్ ప్రూఫ్ పట్టాలను అందజేస్తున్నామని తెలిపారు. ఒక్క రూపాయి అవినీతి లేకుండా, ప్రభుత్వమే ఉచితంగా రైతులకు కొత్త పట్టాదారు పుస్తకాలను పంపిణీ చేస్తోందని, ఎవరైనా రికార్డులు తారుమారు చేస్తే ఈ సాంకేతికత ద్వారా వెంటనే తెలిసిపోతుందని ఆయన వివరించారు.రాయలసీమ అభివృద్ధిపై స్పందిస్తూ సీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. హంద్రీనీవా, గాలేరు నగరి వంటి ప్రాజెక్టులను ఎన్టీఆర్ ప్రారంభిస్తే, వాటిని పూర్తి చేసే అదృష్టం తనకు దక్కిందని చెప్పారు. డోన్ నియోజకవర్గంలో 30 చెరువులకు నీటిని అందించామని, భగీరథుని స్ఫూర్తితో ప్రతి ఎకరాకు నీళ్లివ్వడమే తన సంకల్పమని పేర్కొన్నారు. మామిడి రైతులకు కేజీకి రూ.4 సబ్సిడీ ఇవ్వడంతో పాటు, అంతర్జాతీయ మార్కెట్లో మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్రంలోని శాంతిభద్రతల గురించి మాట్లాడుతూ సీమలో ఒకప్పుడు ఉన్న ముఠా తగాదాలను తుదముట్టించామని, గ్రామాల్లో ప్రశాంతతే ముద్దని తాము నమ్ముతున్నామని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం సిండికేట్లు, కల్తీ మద్యం వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంపై సిబిఐ నివేదికను తప్పుగా ప్రచారం చేస్తున్నారని, స్వామివారి పవిత్రతను దెబ్బతీస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని కరాఖండీగా చెప్పారు. నేరాలు చేసి ఎదురుదాడి చేయడం వారి నైజమని విమర్శించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ 'తల్లికి వందనం' కింద ప్రతి బిడ్డకు రూ.15 వేలు ఇస్తున్నామని, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ద్వారా ఇప్పటికే 50 కోట్ల ప్రయాణాలు పూర్తయ్యాయని సీఎం తెలిపారు. రాష్ట్రంలో 8 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన గత ప్రభుత్వంపై



విమర్శలు చేస్తూ, తమ ప్రభుత్వ హయాంలో కరెంట్ ఛార్జీలు పెంచే ప్రసక్తే లేదని ప్రజలకు భరోసా ఇచ్చారు. అలాగే రోడ్లపై గుంతలు పూడ్చేందుకు రూ.4 వేల కోట్లు కేటాయించామని, వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు పొందే నూతన విధానాన్ని అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడుల ప్రవాహం పెరుగుతోందని, కర్నూలులో డ్రోన్ సిటీ , అనంతపురంలో ఎయిరో స్పేస్ సిటీ ఏర్పాటు చేయబోతున్నామని చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే లక్ష మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దామని, భవిష్యత్తులో మరో 5 లక్షల మందిని ఎంఎస్ఎంఈల ద్వారా ప్రోత్సహిస్తామని చెప్పారు. అభివృద్ధి కేవలం వైకుంఠపాళిలా ఉండకూడదని, పేదల సంక్షేమమే లక్ష్యంగా 'పీ4' విధానం ద్వారా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

## ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ దర్యాప్తు ముమ్మరం



అమరావతి (ప్రశ్న న్యూస్) వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న సుమారు రూ. 4,000 కోట్ల మద్యం కుంభకోణం లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు ఇప్పుడు అత్యంత కీలక దశకు చేరుకుంది. ఈ కేసులో మనీ లాండరింగ్ కోణాన్ని నిశితంగా విచారిస్తున్న ఈడీ, తాజాగా కీలక నిందితులైన ధనుంజయ్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యలకు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచింది. తమ గత పదేళ్ల బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లతో హాజరుకావాలని అధికారుల ఆదేశించడంతో నిందితులు విచారణకు హాజరయ్యారు.ఈ కేసులో ఈడీ ఇప్పటికే భారీ చర్యలకు ఉపక్రమించింది. మార్చి 6న ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి, బూనేటి చాణక్య, ఐఆర్ఎస్ అధికారి వాసుదేవరెడ్డికి చెందిన రూ. 441.63 కోట్ల విలువైన చరాస్తులు, స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఇందులో బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, విలువైన భూములు ఉన్నాయి. దర్యాప్తులో ఇప్పటివరకు దాదాపు రూ. 1,048 కోట్ల మేర ముడుపులు చేతులు మారినట్లు అధికారులు గుర్తించారు. డిస్టిలరీల నుంచి నగదు, బంగారం రూపంలో ఈ అక్రమ సంపాదన జరిగినట్లు ఆధారాలు సేకరించారు.దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు విజయవాడ జిల్లా జైలులో ఉన్న ఏ1 నిందితుడు రాజ్ కేసిరెడ్డిని కోర్టు అనుమతితో విచారించి కీలక వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఆయన ఇచ్చిన సమాచారం ఆధారంగానే ప్రస్తుతం ఇతర అధికారులకు, రాజకీయ అనుచరులకు నోటీసులు వెళ్తున్నాయి.

ప్రజాప్రశ్న



## కేడర్ లో నిర్లిప్తత

తిరుపతి కూటమిలోని ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీలో క్రమ శిక్షణ అనేది నేడు కనిపించడం లేదు. గతంలో మాదిరిగా ఆ పార్టీ నేతలు ఉండటం లేదన్నది అందరికీ అర్థమయింది. పాత నీరు పోయి కొత్త నీరు వచ్చి చేరడంతోనే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు సీనియర్ నేతలు సయితం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిక్కెట్లను ఖరారు చేసే సమయంలోనే తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ ఇబ్బందులు తప్పేవి కదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు.. అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇటువంటి పరిస్థితుల్లోనే ఉన్నారు. కానీ ఎవరిపైనా చర్యలు లేవు. అలాగే ఎవరిని పిలిచి గట్టిగా మందలించిన పాపాన పోలేదని పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్ వంటి వారిపై అనేక ఆరోపణలు వచ్చాయి. వీరంతా కొత్త వారేనని గుర్తు చేస్తున్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు టిక్కెట్లను పొంది గెలిచిన వారు మాత్రమే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, సీనియర్ నేతలు అందరూ వివాదాలకు దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. కానీ ఈ మూడేళ్లలో పార్టీకి జరిగే డ్యామేజీ సంగతేంటని పలువురు తెలుగుదేశం పార్టీ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.మరొకవైపు పార్టీ క్యాడర్ నుంచి కూడా పలు ప్రశ్నలు సోషల్ మీడియా వేదికగా వినిపిస్తున్నాయి. పార్టీ ని పట్టించుకుంటారా లేదా లోకేశ్, చంద్రబాబు నాయుడు ఇలాంటి వి పదే పదే రిపీట్ అవటానికి కారణం మీరే నంటూ వేలు చూపుతున్నారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు, లోకేశ్ లు కష్టపడి ఎన్ని కంపెనీలు ఆంధ్రప్రదేశ్ కు తెచ్చినప్పటికీ, ఉద్యోగాలను కల్పించినప్పటికీ, రోడ్లు ఎంత అభివృద్ధి చేసిన కూడా లోపం ఎక్కడ ఉంది.? కమ్యూనికేషన్ వ్యవస్థ బాగా లేదని వారు నిలదీస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లు ఓట్లు వేయించరు,వాళ్ళ మాటలు విని మోసపోకండి మళ్ళీ మళ్ళీ అంటూ పోస్టులు పెడుతున్నారు. గ్రూప్ రాజకీయాలని కట్టడి చేయాలని, పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలని కోరుతున్నారు. అలాగే టీడీపీ సోషల్ మీడియా కూడా పెద్దగా యాక్టివ్ గా లేదని, దానికి గ్లూకోజ్ ఇచ్చే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు. సోషల్ మీడియా వారియర్స్ తో ఒక ఫొటో దిగేతే వారు యాక్టివ్ అవుతారని లోకేశ్, చంద్రబాబునను కోరుతున్నారు. మరి చంద్రబాబు, లోకేశ్ ఏ రకంగా స్పందిస్తారన్నది చూడాలి.

## నిలిచిపోయిన రొయ్యల, చేపల కంటైనర్లు

విశాఖపట్టణం యుద్ధ జ్వాలలు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. మిడిల్ ఈస్ట్‌లో అమెరికా, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు కేవలం పెట్రోల్ ధరలకే పరిమితం కాకుండా.. ఆంధ్రప్రదేశ్ ఆక్వా రంగాన్ని, తెలంగాణ పౌల్ట్రీ రంగాన్ని నిలువునా ముంచేస్తున్నాయి. గల్ఫ్, యూరప్ దేశాలకు వెళ్లాల్సిన సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు అమాంతం ఆగిపోయాయి. తాజా నివేదికల ప్రకారం.. సుమారు 300 మిలియన్ డాలర్ల విలువైన సీ ఫుడ్ కంటైనర్లు వివిధ పోర్టుల్లో నిలిచిపోయాయి. ఈ భారీ నష్టంలో దాదాపు 60 శాతం వాటా ఒక్క ఆంధ్రప్రదేశ్‌దే కావడం ఆందోళనకరం. విశాఖపట్నం, ముంబై పోర్టుల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన రొయ్యలు, చేపల కంటైనర్లు కదలడం లేదు. ఎర్ర సముద్రం, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ మార్గాల్లో దాడుల భయంతో షిప్పింగ్ నిలిచిపోయిందిఒకవైపు ఎగుమతులు ఆగిపోతుంటే.. మరోవైపు షిప్పింగ్ కంపెనీలు చార్జీలను రెట్టింపు చేశాయి. ఒక్కో కంటైనర్‌పై 1500 నుండి 4000 డాలర్ల వరకు ఎమర్జెన్సీ సర్‌చార్జీలు వసూలు చేస్తున్నాయి. ముఖ్యంగా రొయ్యలు పాడవకుండా ఉంచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. “అమెరికా టారిఫ్‌ల దెబ్బ నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న తరుణంలో.. ఈ యుద్ధం మా వెన్ను విరిచింది” అని సీ ఫుడ్ ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ తెలిపింది. కోల్డ్ స్టోరేజీలు నిండిపోవడంతో, స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీనివల్ల పల్లెల్లో రొయ్యల ధరలు దారుణంగా పడిపోయే ప్రమాదం కనిపిస్తోంది.యుద్ధం ప్రభావం కేవలం సముద్ర ఉత్పత్తులపైనే కాదు మన పౌల్ట్రీ రంగంపై కూడా తీవ్రంగా పడింది. హైదరాబాద్, నామక్కల్ ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లాల్సిన గుడ్ల ఎగుమతులు నిలిచిపోయాయి. ఎగుమతులు ఆగడంతో స్థానిక మార్కెట్‌లో గుడ్ల నిల్వలు పెరిగి, ధరలు పడిపోతున్నాయి. దీనివల్ల పౌల్ట్రీ రైతులకు రోజుకు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లుతోంది. భారత హలాల్ మాంసం ఎగుమతుల్లో సగానికి పైగా వాటా గల్ఫ్ దేశాలదే. ఇప్పుడు ఇన్సూరెన్స్ రేట్లు పెరగడం, కంటైనర్లు ముంబై పోర్టులోనే ఆగిపోవడంతో వేలాది టన్నుల మాంసం పాడైపోయే పరిస్థితి ఏర్పడింది.పెట్రోల్ రేట్ల గురించి సామాన్యుడు భయపడుతుంటే.. అంతర్జాతీయ వాణిజ్య మార్గాలు మూసుకుపోవడంతో తెలుగు రైతు తన పెట్టుబడి ఎక్కడ సముద్రం పాలవుతుందోనని బిక్కుబిక్కుమంటున్నాడు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎగుమతిదారులకు, రైతులకు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.అరటిపై ప్రభావంవెంకీ పెళ్లి సుబ్బి చావుకు వచ్చినట్లుంది అరటి రైతుల పరిస్థితి. ఎక్కడో అమెరికా ఇరాన్ పై దాడి చేసి యుద్ధం చేస్తుంటే ఆ ప్రభావం కర్నూలు జిల్లా అరటి రైతులకు తీవ్రంగా పడింది వారి పాలిట శాపంగా మారింది.ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు అరటి పంటలు భారీగా సాగు చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం కన్ను ఒకటి వెయ్యి నుంచి 2000 ఉండే ది. అరటి కోసే కూలీలకు కూడా ఆ ధర సరిపోక రైతులు ఎక్కడపడితే అక్కడ పారవేశారు. ఇంకా కొన్ని అయితే పశువులకు మేతగా వేశారు. ఆ తర్వాత పుంజుకుని టన్ను అరటి 25 వేల వరకు వెళ్ళింది. ఇరాన్ పై అమెరికా దాడి చేయకముందు వరకు ఆ ధర పలికింది. ఖర్చులన్నీ కూడా కరెంటు రైతులకు ఎకరాలు రెండు లక్షలకు పైగా మిగిలేది. గల్ఫ్ యుద్ధంతో ఒక్కసారిగా పడిపోయింది . టన్ను అరటి ధర 10 వేలు కూడా రావడం లేదని, రెండు మూడు రోజుల వివాదిలోని 60 శాతం పైగా ధర పడిపోవడం తప్ప రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్ సహా గల్ఫ్ కంట్రీస్ కి యుద్ధం కారణంగా ఆ దేశాలకి అరటి ఎగుమతులు నిలిచిపోవడంతో ధర పతనమైనట్టు వ్యాపారులు రైతులు చెప్పున్నారు. ధర కోసం వేచి చూస్తే పొలంలోని అరటి మాగిపోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

## విజయడైరీకి ఏపీ కష్టాలు
## పడిపోయిన నెయ్యి అమ్మకాలు

హైదరబాద్ తెలుగు రాష్ట్రాల్లో దశాబ్దాలుగా పాడి రైతులకు భరోసాగా, కోట్లాది మంది వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులకు చిరునామాగా వెలుగొందిన ‘విజయ’ బ్రాండ్ నేడు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయింది. ఒకప్పుడు ప్రభుత్వ రంగ సంస్థగా తిరుగులేని ఆదరణ పొందిన ఈ సంస్థ, ప్రస్తుతం కల్తీ ఆరోపణలు, రాజకీయ వివాదాల సుడిగుండంలో చిక్కుకుని తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మొదలైన ఈ కల్తీ వ్యవహారం, ఇప్పుడు సరిహద్దులు దాటి తెలంగాణలోని విజయ డెయిరీ ప్రతిష్టను కూడా మసకబారుస్తోంది. కేవలం కొందరి స్వార్థం కోసం దశాబ్దాల చరిత్ర కలిగిన ఒక బ్రాండ్‌ను ఫ్రాంచైజీల పేరిట ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడమే ఈ వినాశనానికి మూలకారణమని విశ్లేషకులు భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయ డెయిరీ కార్యకలాపాలను విస్తరించే క్రమంలో ప్రవేశపెట్టిన ఫ్రాంచైజీ విధానం అక్రమార్కులకు వరంగా మారింది. ప్రభుత్వ పర్యవేక్షణ నామమాత్రంగా మారడంతో, నాణ్యతా ప్రమాణాలను గాలికి వదిలేసి కేవలం లాభాలే ధ్యేయంగా ఫ్రాంచైజీలు పనిచేశాయి. ఈ క్రమంలోనే తక్కువ ధరకు లభించే పామాయిల్ లేదా ఇతర జంతువుల కొవ్వులను కలిపిన కల్తీ నెయ్యిని విజయ లేబుల్‌తో మార్కెట్లోకి విడుదల చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం వెలుగులోకి రావడంతో, అప్పట్లో సరఫరా అయిన విజయ నెయ్యి నాణ్యతపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ ప్రభావం కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాకుండా, పొరుగు రాష్ట్రమైన తెలంగాణలోని విజయ ఉత్పత్తుల అమ్మకాలపై కూడా తీవ్ర ప్రభావం చూపింది.తెలంగాణలోని విజయ డెయిరీ ( లాభాల్లో ఉన్నప్పటికీ, ఏపీలో జరిగిన పరిణామాల వల్ల ఇక్కడి వినియోగదారుల్లో కూడా అభద్రతాభావం నెలకొంది. విజయ పాలు లేదా నెయ్యి అంటే కళ్ళు మూసుకుని కొనే ప్రజలు, ఇప్పుడు ఇతర ప్రైవేట్ బ్రాండ్ల వైపు మొగ్గు చూపుతున్నారు. దీనివల్ల మార్కెట్‌లో విజయ ఉత్పత్తుల వాటా క్రమంగా తగ్గుతోంది. అమ్మకాలు పడిపోవడంతో దాని ప్రభావం నేరుగా క్షేత్రస్థాయిలో ఉన్న పాడి రైతులపై పడుతోంది. డెయిరీకి వచ్చే పాల సేకరణ తగ్గడం వల్ల రైతులు తమ పాలను ప్రైవేట్ డైరీలకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడమే కాకుండా, సహకార రంగంపై రైతులకు ఉన్న నమ్మకాన్ని సడలిస్తోంది.ఈ మొత్తం వ్యవహారంలో పర్యవేక్షక లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సాధారణంగా ప్రభుత్వ బ్రాండ్ అంటే ప్రజల్లో ఒక రకమైన భరోసా ఉంటుంది. కానీ ఫ్రాంచైజీలకు ప్యాకేజింగ్, తయారీ బాధ్యతలను అప్పగించినప్పుడు, ప్రభుత్వం తరపున నిరంతర తనిఖీలు నిర్వహించడంలో వైఫల్యం చెందారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాధాన్యత ఇవ్వడంతో నాణ్యత అనే అంశం అప్రధాన్యంగా మారింది. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ ముద్రను వాడుకుంటూ కల్తీకి పాల్పడటం అనేది ముమ్మాటికీ వ్యవస్థాగత వైఫల్యమే. రాజకీయ నాయకుల అండదండలతోనే ఇటువంటి అక్రమాలు సాధ్యమవుతాయని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి ఇక్కడి దాకా వచ్చిందని విమర్శలు వస్తున్నాయి.ప్రస్తుత తరుణంలో విజయ బ్రాండ్ తన పూర్వవైభవాన్ని సంతృప్తి పరుచుకోవాలంటే సమూలమైన మార్పులు అవసరం. రాజకీయాలకు అతీతంగా, కల్తీకి పాల్పడిన ఫ్రాంచైజీల లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అలాగే తెలంగాణ ప్రభుత్వం కూడా తన డెయిరీ ఉత్పత్తుల నాణ్యతను నిరూపించుకోవడానికి అత్యాధునిక ల్యాబ్‌ల ద్వారా ప్రతి బ్యాచ్‌ను పరీక్షించి, ఆ రిపోర్టులను బహిరంగంగా అందుబాటులో ఉంచాలి. సహకార రంగాన్ని కాపాడుకోవడం అంటే కేవలం ఒక సంస్థను కాపాడుకోవడం కాదు, దాని వెనుక ఉన్న లక్షలాది మంది రైతుల జీవనోపాధిని కాపాడటమే. ప్రభుత్వం తక్షణమే స్పందించి గట్టి చర్యలు తీసుకోకపోతే, అద్భుతమైన చరిత్ర కలిగిన విజయ బ్రాండ్ కేవలం ఒక జ్ఞాపకంగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

## భూజాన వేసుకొని నడిపించిన బొత్స

విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రస్తుతం వైఎస్ఆర్‌సీపీ పరిస్థితి విచిత్రంగా మారింది. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఒకవైపు, సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మరో వైపు అన్నట్టుగా వ్యవహారం సాగుతోంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాల సమయంలో జగన్ అనుసరిస్తున్న తీరు సొంత పార్టీ క్యాడర్‌లోనే తీవ్ర అసహనానికి దారితీస్తోంది. రాష్ట్రంలో కీలకమైన చర్చలు జరుగుతున్నప్పుడు, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన సమయంలో జగన్ రెడ్డి ఏపీలో ఉండకుండా బెంగళూరు ప్యాలెస్‌కే పరిమితం కావడం ఆయన పలాయన వాదానికి నిదర్శనమని సొంత పార్టీ వారే తేల్చేస్తున్నారు.అధినేత లేని లోటును భర్తీ చేస్తూ, మండలిలో ప్రభుత్వాన్ని ఢీకొట్టడంలో బొత్స సత్యనారాయణ అసలైన ‘ఫైటర్’అనిపించుకున్నారు. అనారోగ్య కారణాలతో ఆసుపత్రిలో చేరినప్పటికీ, కోలుకున్న వెంటనే నేరుగా సభకు వచ్చి అధికార పక్షంపై విరుచుకుపడటం బొత్సలోని రాజకీయ పట్టుదలను చాటిచెబుతోంది. ఒకవైపు వయసు, మరోవైపు అనారోగ్యం ఉన్నా సరే.. బాధ్యత గల ప్రతిపక్ష నేతగా ఆయన చూపుతున్న చొరవ ఇప్పుడు వైఎస్ఆర్‌సీపీ శ్రేణుల్లో హాట్ టాపిక్ అయింది. అధినేత రారు.. సీనియర్ నేత అస్వస్థతలోనూ పోరాడుతున్నారు అనే చర్చ క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది.అసెంబ్లీకి వెళ్లడం ఇష్టం లేక, కూటమి సర్కార్ అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనో జగన్ రెడ్డి బెంగళూరుకు వెళ్లిపోవడం ఆయన రాజకీయ చేతకానితనాన్ని' సూచిస్తోంది. ప్రతిపక్ష నేతగా ఉండాల్సిన కనీస బాధ్యతను కూడా గాలికొదిలేసి, సోషల్ మీడియా పోస్టులకే పరిమితం కావడం కార్యకర్తలను నిరాశకు గురి చేస్తోంది. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం దెబ్బలు తింటున్న వారు, కేసులపాలవుతున్న వారు.. తమ నాయకుడు ఇలా పారిపోతుంటే ఎవరి కోసం పోరాడాలని ప్రశ్నించుకుంటున్నారు. జగన్ లోపించిన ధైర్యం, బొత్సలో స్పష్టంగా కనిపిస్తుండటంతో నాయకత్వ మార్పు గురించిన అంతర్గత చర్చలు మొదలయ్యాయి.రాజకీయాల్లో ఓటమి సహజం, కానీ ఓటమి తర్వాత మైదానం విడిచి పారిపోవడం నాయకత్వ లక్షణం అనిపించుకోదు. జగన్ రెడ్డి ఒకవైపు బెంగళూరులో విశ్రాంతి తీసుకుంటుంటే, బొత్స సత్యనారాయణ ఆసుపత్రి బెడ్ నుంచి వచ్చి సభలో గర్జిస్తున్నారు. ఈ పరిణామాలు వైఎస్ఆర్‌సీపీలో జగన్ పట్టు కోల్పోతున్నారనే సంకేతాలను ఇస్తున్నాయి. పార్టీ ఉనికిని కాపాడటానికి ఒక సీనియర్ నేత ప్రాణాలకు తెగించి పోరాడుతుంటే, వారసత్వంగా వచ్చిన అధికారాన్ని కాపాడుకోలేక జగన్ చేస్తున్న పలాయన ప్రదర్శన పార్టీని పాతాళానికి తొక్కేసే ప్రమాదం ఉంది.

## ఉచితాల వరదలో విజయ్...

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీ ద్వారా ప్రకటిస్తున్న ఉచితాల వరద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న పథకాలకు రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆయన హామీలు అటు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఇటు విమర్శలకు పదును పెడుతున్నాయి. విజయ్ అనుసరిస్తున్న ఈ వ్యూహం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు ఆయన రాజకీయ పరిణతిని ఇది ప్రశ్నార్థకం చేస్తోంది.కనీసం వార్డు మెంబర్‌గా కూడా అనుభవం లేని విజయ్, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసి ఇలాంటి భారీ హామీలు ఇవ్వడంపై మేధావి వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అనుభవం సున్నా అయిన వ్యక్తి, రాష్ట్ర ఖజానాపై పడే వేల కోట్ల భారాన్ని ఎలా మేనేజ్ చేస్తారనేది ప్రధాన ప్రశ్న. స్టాలిన్ ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కష్టపడుతుంటే, విజయ్ అంతకు రెట్టింపు ఇస్తాననడం అసాధ్యమైన హామీ గా ప్రజలు భావించే ప్రమాదం ఉంది. ఇది ఆయనను ఒక ‘సీరియస్ పొలిటీషియన్ గా కాకుండా, కేవలం ఓట్ల కోసం ఆశ చూపే సినిమా గ్లామర్ నేతగా ముద్ర వేసే అవకాశం ఉంది.విజయ్ పార్టీపై యువతలో ఉన్న ప్రధాన ఆశ మార్పు . దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల మధ్య నలిగిపోతున్న తమిళనాట ఒక కొత్త రాజకీయ సంస్కృతి వస్తుందని ఆశించిన వారికి, ఈ ఉచితాల ప్రకటనలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఇతర రాజకీయ నాయకులలాగే విజయ్ కూడా ఉచితాలనే నమ్ముకోవడం వల్ల, ఆయన ప్రత్యేకత ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది. మార్పు కోరుకునే ఓటర్లు కేవలం డబ్బు లేదా వస్తువుల కోసం ఓటు వేయరు. వారు వ్యవస్థాగత మార్పును కోరుకుంటారు.

ఈ క్రమంలో విజయ్ తనకున్న యూత్ ఐకాన్ ఇమేజ్‌ను కోల్పోయి, పాతతరం రాజకీయాలనే పునరావృతం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారమే పరమావధిగా ఆయన దేనికైనా తెగిస్తున్నారనే సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం గెలవడమే లక్ష్యంగా ఇలాంటి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిధులు లేవు అనే సాకుతో చేతులెత్తేస్తారేమో అన్న భయం సామాన్యుల్లో కలగడం సహజం. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీలను ఢీకొట్టాలంటే ఈ మాత్రం షో ఉండాలని విజయ్ వర్గం వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆయన మాటల్లోని నిజాయితీని ఎంతవరకు నమ్ముతారన్నదే ఇక్కడ అసలు పాయింట్. తమిళ రాజకీయాల్లో ఉచితాలు అనేవి గెలుపు గుర్రాలుగా మారిన చరిత్ర ఉంది. అందుకే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ఆయన పథకాల వరద పారిస్తున్నారు. అయితే, సినిమా స్క్రిప్ట్ లాగా హామీలు ఇవ్వడం సులభం కానీ, బడ్జెట్ అంకెలను సరితూచడం కష్టమనే నిజాన్ని ఆయన త్వరలోనే గ్రహించాల్సి ఉంటుంది.

తమిళనాడు రాజకీయాల్లో అధికారంలో వాటా ఇస్తామంటూ సరికొత్త ప్రకటనతో సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డీఎంకే వంటి బలమైన పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కూటమి కట్టాలని ఆయన చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన మొదటి బహిరంగ సభలోనే మిత్రపక్షాలకు రెడ్ కార్పెట్ పరిచిన విజయ్ ఆఫర్‌పై తొలత కాంగ్రెస్, వీసీకే వంటి పార్టీలు ఆసక్తి చూపినప్పటికీ అవేవీ డీఎంకే కూటమిని వీడలేదు. ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి తన మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటులో కొంత వెసులుబాటు కల్పించి వారు బయటకు వెళ్లకుండా కట్టడి చేయడంలో విజయం సాధించారు. దీంతో ప్రస్తుతం విజయ్ రాజకీయ క్షేత్రంలో ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ డీఎంకే లేదా అన్నాడీఎంకే కూటముల్లో స్థిరపడటంతో టీవీకే భవిష్యత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పన్రుట్టి రామచంద్రన్ వంటి కొద్దిమంది మద్దతు తప్ప విజయ్‌కు బలమైన రాజకీయ అండ లభించలేదు. యువత , తొలిసారి ఓటు వేసే వారిపైనే ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు కూడా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి.

ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం , అందులో పేర్కొన్న అంశాలను ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఈ వ్యక్తిగత ఆరోపణలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

## దానం పై వేటు... పక్కా ?

హైదరబాద్ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటీషన్ పై విచారణ ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పును రిజర్వ్ చేశారు. ఈరోజుతో అనర్హత ఎమ్మెల్యేల పిటీషన్లపై విచారణ ముగిసింది. మొత్తం పది మంది ఎమ్మెల్యేలు తమ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి మారినట్లు బీఆర్ఎస్ వారిపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.ఇప్పటి వరకూ ఎనిమిది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారినట్లు ఆధారాలు లేవని స్పీకర్ గడ్డం ప్రసాదరావు తీర్పు చెప్పారు. ఇక కడియం శ్రీహరి, దానం నాగేందర్ విషయంలోనే తీర్పు చెప్పాల్సి ఉంది. అయితే కడియం శ్రీహరి విషయంలో ఏమో గాని దానం నాగేందర్ పై మాత్రం ఖచ్చితంగా అనర్హత వేటు పడే అవకాశాలున్నాయని చెబుతున్నారు.దానం నాగేందర్ తో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా అందుకు సిద్ధమయినట్లే సమాచారం. సుప్రీంకోర్టులో కేసు ఉన్నందున దానం నాగేందర్ విషయంలో అనర్హత వేటు పడటం ఖాయమన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తుంది. సాంకేతికంగా ఆధారాలుండటం వల్లనే దానం నాగేందర్ అనర్హత వేటు నుంచి తప్పించుకోలేరని న్యాయ నిపుణులు కూడా చెబుతున్నారు.

2023 లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తర్వాత కాంగ్రెస్ పార్టీకి మద్దతుదారుగా నిలిచారు. అయితే మిగిలిన ఎమ్మెల్యేలు కూడా కండువాలు కప్పుకున్నప్పటికీ వారికి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం మాత్రం ఇవ్వలేదు. దానం నాగేందర్ విషయం మాత్రం డిఫరెంట్. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాత్రం బీఆర్ఎస్ గుర్తుపై ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలిచి 2024 లోజరిగిన పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో దానం నాగేందర్ సాంకేతికంగా కాంగ్రెస్ లో చేరినట్లేనని న్యాయనిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు.

అందుకే తొలి నుంచి దానం నాగేందర్ ఒక్కరిపై వేటు పడే అవకాశాలున్నాయని ప్రచారం జరుగుతుంది. మరొకవైపు ఇప్పటికే హైదరాబాద్ నగరంలో కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచిన నేపథ్యంలో ఖైరతాబాద్ కు కూడా ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉందని మాత్రం రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతుంది. అయితే అనర్హత వేటుపడినా ఆరునెలల్లో ఉప ఎన్నిక జరగాల్సి ఉంటుంది. అయితే స్పీకర్ నిర్ణయం ఎలా ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది

## సోమవారం కొనసాగిన సునీల్ నాయక్ విచారణ

గుంటూరు రఘురామ కృష్ణం రాజు కేసులో విచారణకు ఐపీఎస్ సునీల్ నాయక్ వచ్చారు. సోమవారం కూడా విచారణ కొనసాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు 9 వరకు విచారణ కొనసాగనుంది. ఎస్పీ దామోదర్ బృందం అయనను విచారిస్తోంది. తనకు ఎలాంటి సంబంధం లేదని గత కొన్ని రోజులుగా సునీల్ నాయక్ చెబుతున్నట్లు సమాచారం.

## తెరపైకి బీసీ రిజర్వేషన్ అంశం

విజయవాడ కర్ణుడు పెళ్ళికి సవాలక్ష కారణాలు అన్నట్టు మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ ఓడిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనేది దారుణంగా దెబ్బతీసింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని. దశాబ్దాల చరిత్ర కలిగిన ఆంధ్రప్రదేశ్లో పట్టాదారు పాసుపుస్తకాలపై ముఖ్యమంత్రి ఫోటో వేసుకోవడం ఎప్పుడూ లేదు. కానీ తొలిసారిగా జగన్మోహన్ రెడ్డి ఫోటో వేయడంతో ప్రజల్లో ఒక రకమైన అభద్రతాభావం ఏర్పడింది. దానిని హైలెట్ చేసుకుంటూ ముందుకు సాగింది కూటమి. ప్రజల్లో బలమైన చర్చ జరిగేందుకు పెద్ద ఎత్తున ప్రచారం నడిచింది. ప్రజల్లోకి ఆ అంశం బలంగా వెళ్లడం.. బాహాటంగా వ్యతిరేకించడంతో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి దారుణ ఓటమి ఎదురైంది. ముఖ్యంగా తటస్తులు, ఏ పార్టీతో సంబంధం లేని వారు కూడా ఈ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను దారుణంగా వ్యతిరేకించారు. జగన్మోహన్ రెడ్డి పై ఉన్న భయంతో కూటమి పార్టీలకు ఓటు వేశారు.అయితే ఇప్పుడు సీన్ మారింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చింది. గతంలో కూటమి పట్టుకున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మాదిరిగా.. కూటమి ప్రభుత్వ వైఫల్యాన్ని పట్టుకోవాలని చూస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ కూటమి పట్టు చిక్కడం లేదు. దీంతో ఎంతవరకు కాపు రాజకీయం, అంబటి రాంబాబు లాంటి వారిపై కేసులతో ఇబ్బంది పెడుతున్నారని.. వైసీపీ నేతలను అరెస్టు చేస్తున్నారని.. రెడ్బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లే బలమైన ఆయుధాన్ని మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టుకోలేకపోతోంది. ఇది నిజంగా ఆ పార్టీకి లోటు. అయితే అధికారపక్షంగా ఉన్న కూటమి ఎన్నికలకు అవసరమైన ప్రచార అస్త్రాలను ఇప్పటికే సంపాదించుకుంది. వాటితోనే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని దెబ్బతీయాలని చూస్తోంది.టీటీడీ లడ్డు తయారీకి సంబంధించి నెయ్యి కల్తీ వ్యవహారం.. వచ్చే ఎన్నికల వరకు సజీవంగా ఉంచేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో నెయ్యి కల్తీ జరిపారు అన్నది ప్రత్యేక దర్యాప్తు బృందం తేల్చింది. కానీ ఎంతవరకు ప్రభుత్వ పెద్దలు చెప్పినట్టు జంతు కొవ్వు కలపలేదు కదా అని ప్రశ్నిస్తోంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కానీ పామాయిల్ తో కూడిన రసాయనాలతో నెయ్యి తయారు చేశారని.. అసలు పాలతో తయారుచేసిన నెయ్యి కాదని సిట్ తేల్చింది. ఎంతవరకు జంతు కొవ్వు అన్న ఆరోపణ చేశారు కాబట్టి.. అందులో కలపలేదని సిట్ తేల్చింది కాబట్టి తామేదో బయటపడ్డామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. కానీ వైసీపీ హయాంలో తప్పు జరిగిందని మెజారిటీ ప్రజలు ఒక నిర్ణయానికి వచ్చారు. అందుకే ఈ అంశాన్ని సజీవంగా ఉంచాలని భావిస్తోంది కూటమి. వచ్చే ఎన్నికల్లో ఇదొక ప్రచార అస్త్రంగా మారుతుందని భావిస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని హిందుత్వవాదంతో వచ్చే ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తోంది కూటమి. అందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకుంటుంది. ప్రస్తుతం వివిధ పీఠాధిపతులు, హిందూ మతానికి చెందిన పెద్దలు మీడియా ముందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ఏకంగా చిన్న జీయర్ స్వామి లాంటివారు అమరావతిని మార్చాలని కొందరు ప్రయత్నించారని.. భగవంతుడే కాపాడుకున్నాడంటూ వ్యాఖ్యానించారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. హిందుత్వవాదం ఎక్కడ వినిపిస్తే అక్కడ బిజెపి అనుబంధ సంస్థలు వాలిపోతాయి. ఇప్పుడు కేంద్రంలో బిజెపి నేతృత్వంలో ప్రభుత్వం పవర్ఫుల్ గా ఉంది. కచ్చితంగా వచ్చే ఎన్నికల నాటికి హిందుత్వవాదం అనేది ఏపీలో కచ్చితంగా ప్రభావం చూపుతుంది. మరోవైపు బీసీ రిజర్వేషన్ల అంశం అనేది కూటమికి ఒక ప్రచార అస్త్రంగా మారనుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో 32 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేసి ప్రజల్లోకి బలంగా వెళ్లనుంది కూటమి. 2021లో వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. అప్పుడు బీసీ రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చిక్కింది. కానీ ఆ పని చేయలేదు. పైగా బీసీ వాదంతో ముందుకెళ్లిన జగన్మోహన్ రెడ్డిని దారుణంగా ఓడించారు బీసీలు. ఇప్పుడు రిజర్వేషన్లు ఖరారు చేయడం ద్వారా బీసీలను శాశ్వతంగా తనవైపు ఉంచుకోవాలని కూటమి బావిస్తోంది. మరోవైపు మద్యం కుంభకోణం కేసును సైతం చివరి వరకు తీసుకెళ్లేందుకు కూటమి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు సగం మాత్రమే దర్యాప్తు జరిగిందని స్వయంగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. తద్వారా ఇదో ఎన్నికల అస్త్రంగా మారనుంది. ప్రతిపక్షానికి అవసరమైన ఎన్నికల అస్త్రాలు సమకూరుతాయి. కానీ ఏపీలో మాత్రం అందుకు విరుద్ధంగా అధికార పక్షానికి చిక్కడం విశేషం.

## స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ మూసివేత..
## భారంగా మారుతున్న ఆయిల్

న్యూఢిల్లీ ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం రోజు రోజుకూ తీవ్రం అవుతోంది. అందరూ ఊహించినట్లుగానే యుద్ధం ప్రారంభం అయిన వెంటనే ఇరాన్ ఆర్మూజ్ జలసంధి మూసివేసింది. ఇక యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎవరూ ఊహించని విధంగా ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి చేపట్టింది. ఈ పరిణామాలు ఆయిల్ సంక్షోభానికి దారితీస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తున్నాయి. షేర్ మార్కెట్లను కుంగదీస్తున్నాయి.ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ బలగాలు మోహరించిన ఈ సంకీర్ణ జలమార్గం ప్రపంచ చమురు రవాణాలో 20% భాగస్వామి. రోజుకు 20 మిలియన్ బ్యారెళ్లు, సంవత్సరానికి 500 బిలియన్ డాలర్ల విలువైన వాణిజ్యం ఆగిపోయింది. వెడల్పు కేవలం 32 కిమీతో పరిమితమైన సంధి ఇప్పుడు ప్రమాదకర ప్రాంతంగా మారింది.యుద్ధం తర్వాత ఇరాన్ గల్ఫ్ దేశాలపై దాడి చేసింది.

మొదట ఖతార్‌ను టార్గెట్ చేసింది. ఆ దేశంలోని రాస్ లఫాన్ పారిశ్రామిక కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి చేయడంతో ఖతార్ గ్యాస్, చమురు కార్ఖానాలను నిలిపివేసింది. ప్రపంచ ఎల్ఎన్‌జీ సరఫరాలో 20% ఈ దేశం బాధ్యత వహిస్తుంది. ఆసియా మార్కెట్‌లకు 82% ప్రభావం. దీంతో ఇంధన ధరలు ఐరోపాలో 54%, ఆసియాలో 39% ృపెరిగాయి.ఖతార్ నుంచి 42% ఇంధనం భారత్‌కు సరఫరా అవుతుంది. అయితే భారత్ 5 వారాల నిల్వలతో తాత్కాలిక ఊపిరి పీల్చుకుంటోంది. శ్రీలంక, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి పొరుగు దేశాలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నాయి. చైనాకు కూడా భారీ నష్టం. దీర్ఘకాలంలో ఇంధన ధరలు, దిగుమతి ఖర్చులు పెరిగి ఆర్థిక ఒత్తిడి తీవ్రమవుతుంది.సరుకు పడవలు, ఓడలు ఆగిపోవడంతో అంతర్జాతీయ వాణిజ్యం దెబ్బతింది. స్టాక్ మార్కెట్లలో క్షీణత, ఎనర్జీ రంగాల్లో అస్థిరత పెరిగాయి. ఇరాన్ వ్యూహం ప్రపంచ దేశాలను అమెరికా వ్యతిరేక ఒత్తిడికి దోహదపడుతోందిఈ సంక్షోభం ఆయిల్ ధరలను రెట్టింపు చేస్తూ ద్రవ్యోల్బణాన్ని రేకెత్తించవచ్చు. గల్ఫ్ మిత్రదేశాల ఉత్పత్తి పునరుద్ధరణకు వారాలు పట్టవచ్చు; ఇది పర్యటక, ఉత్పాదక రంగాలను ప్రభావితం చేస్తుంది. భారత్ వంటి దేశాలు వైవిధ్యీకరణ ప్రణాళికలను వేగవంతం చేయాలి.

## గులాబీ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలకు శిక్షణ

హైదరాబాద్ బీఆర్ఎస్ పార్టీ తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వర్క్ షాపు నిర్వహించబోతుంది. ఈ నెల 10న గ్రేటర్ పరిధిలోని ఓ ప్రైవేటు రిసార్టులో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ ఇప్పించబోతుంది.అందుకు సబ్జెక్టుల వారీగా నిపుణులను సైతం ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోందిజాతీయ,అంతర్జాతీయ సమకాలిన రాజకీయాలు,రాష్ట్ర రాజకీయాలు రాష్ట్ర ప్రభుత్వం విధానాలు,ఆర్థిక అంశాలపై శిక్షణ ఇప్పించాలని గులాబీ పార్టీ భావిస్తుంది. ఈ వర్క్ షాపుకు పార్టీ అధినేత కేసీఆర్ హాజరు అవుతారా అనే దానిపై క్లారిటీ రావాల్సి ఉంది.ఈ నెల 16 నుంచి బడ్జెట్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభవుతుండటంతో అనుసరించాల్సిన అంశాలు,వ్యూహాలపై వర్క్ షాప్ లో దిశానిర్దేశం చేయబోతున్నారు.

అదే విధంగా సమాచార హక్కు చట్టంను ఎలా వినియోగించుకోవాలనే దానిపై ప్రత్యేకంగా క్లాసులు భోదించనున్నారు.ప్రభుత్వం నుంచి సమాచారం ఇవ్వకుంటే ఎలా ముందుకు పోవాలి.గత ఎన్నికల్లో కాంగ్రెస్ హామీలు,ఆరు గ్యారెంటీల వైఫల్యాలపై ఎలా ప్రజల్లోకి వెళ్లాలి పంచాయతీ,మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తదితర అంశాలపై సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషకులతో శిక్షణ ఇప్పించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా బడ్జెట్ సమావేశాల్లో నిలదీయాలని గులాబీ పార్టీ భావిస్తోంది. ఏయే రంగాలకు ఎంత బడ్జెట్ పెడితే గతంలో పెట్టిన బడ్జెట్ తో పోల్చి ఎలా మాట్లాడాలి. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు విద్యకు, వైద్యానికి, వ్యవసాయం, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఇలా తదితర రంగాలకు కేటాయింపులపైనా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన నిధులను వివరించి మాట్లాడి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలి అనే దానిపై ఈ వర్క్ షాపు ఏర్పాటు చేశారు.ఇక బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యేలకు శిక్షణా తరగతులను ఏర్పాటు చేశారు.ఆ తర్వాత ఎప్పుడూ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించలేదు.ఇప్పుడు బిఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉంది. దీంతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తొలిసారి ఎన్నికైన వారు ఉన్నారు. వారికి శిక్షణ ఇప్పిస్తే ఆయా అంశాలపై నాలెడ్జ్ వస్తుందని బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం లెక్కలు వేస్తోంది. ఇక మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్, అసెంబ్లీ మాజీ కార్యదర్శి సదారాంతో పాటు ఇతర విశ్లేషకులు రాజకీయ అంశాలు, ఆర్థిక అంశాలపై క్లాసులు చెప్పనున్నారు. మొత్తానికి తమ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు శిక్షణ ఇప్పించడం ద్వారా గులాబీ పార్టీకి ఏ మేరకు కలిసి వస్తుందో చూడాలి.

## చండూరు లో 5 కె రన్

నల్గొండ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల భాగంగా ఈరోజు చండూర్ మున్సిపల్ పట్టణంలో 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చండూరు మున్సిపల్ కమిషనర్ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ కోడి శ్రీనివాసులు, తాసిల్దార్ రమాకాంత్,వార్డు కౌన్సిలర్లు అధికారులు యువతీ, యువకులు పాల్గొన్నారు.

## లక్ష్యం మంచిదే..
## కానీ వ్యూహంలోనే లోపమా?

హైదరాబాద్ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొంది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది.ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారం ఎక్కువగా వినిపిస్తోంది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలు ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తోందనే ప్రచారాన్ని అందించినట్లయింది. ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనల ప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా, పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, వారిని ఒప్పించిన తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిపక్షంలో, ఈ కూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# స్పీకర్ పై అవిశ్వాసం..

న్యూఢిల్లీ దేశంలో ఎండలు ముదురుతున్నట్లే.. పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు అధికార విపక్షాల మధ్య రాజకీయ వేడిని మరింత పెంచనున్నాయి. ఏప్రిల్ 2 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో స్పీకర్ ఓం బిర్లా పై అవిశ్వాస తీర్మానం,బడ్జెట్ చర్చలు, డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్, ఫైనాన్స్ బిల్లు సహా ఇతర బిల్లులపై చర్చలు జరగనున్నాయి. మొదటి విడతలో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం, 2026-27 వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టడం,రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ, బడ్జెట్ ఆమోదం జరిగింది. తొలిసారి లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మా.. ప్రధాని ప్రసంగం లేకుండానే ఆమోదం పొందింది. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం,మాజీ ఆర్మీ చీఫ్ నారావణే ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తక వివాదం, ప్రతిపక్ష నేతను మాట్లాడనీయకుండా స్పీకర్ అడ్డుకోవడం,లోక్ సభ నుంచి 8 మంది ఎంపీల సస్పెన్షన్, ప్రధాని మోదీ పై విపక్ష మహిళా ఎంపీల దాడి ఆరోపణలు, స్పీకర్ పై విపక్ష ఎంపీల అవిశ్వాస తీర్మానం తో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. విపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసు ప్రకారం.. కాంగ్రెస్ ఎంపీలు ముహమ్మద్ జావేద్, కె.సురేశ్, మల్లు రవి ముగ్గురు ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. స్పీకర్ ఓం బిర్లా పక్షపాత ధోరణి చూపుతున్నారని, నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదనీ, మహిళా విపక్ష ఎంపీలపై అనుచిత ఆరోపణలు చేశారనీ ప్రజా సమస్యలు లేవనెత్తినందుకు 8 మంది విపక్ష ఎంపీలను పూర్తి సమావేశానికి సస్పెండ్ చేశారనీ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే అధికార పార్టీ బీజేపీ,ఎన్‌డీఏ సభ్యులు మాజీ ప్రధాన మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదని వివాదాస్పద విషయాల్లో బహిరంగంగా అధికార పార్టీకి మద్దతిచ్చారని విపక్షాలు మండిపడుతున్నాయి.

స్పీకర్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం లేదని 118 మంది విపక్ష ఎంపీలు లోక్ సభ సెక్రటరీ జనరల్‌కి ఫిబ్రవరి 10 తేదీన అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. తీర్మానంలో స్పీకర్ ఇకపై సభలో అన్ని పార్టీల నమ్మకాన్ని కోల్పోయారనీ స్పీకర్ పక్షపాత వైఖరి సభ్యుల హక్కులను దెబ్బతీస్తోందనీ సభ సాఫీగా నడవకుండా చేస్తోందనీ ఆరోపించారు..రాజ్యాంగం ఆర్టికల్ 94 సి ప్రకారం.. తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 50 మంది సభ్యులు నిలబడి మద్దతు తెలపాలి. దీనికి అనుగుణంగా అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ జరుగుతుంది. స్పీకర్ చర్చలో పాల్గొని ఓటు వేయవచ్చు కానీ అధ్యక్షత వహించలేరు. ఆయన అధికార పార్టీ సభ్యుల మధ్య కూర్చోవచ్చు. కానీ ఓం బిర్లా ఈ అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన తరువాత నిబంధనల ప్రకారం 14 రోజులకు సమయం పూర్తయినందున అవిశ్వాస తీర్మానం అంశాన్ని పార్లమెంట్ లిస్ట్ ఆఫ్ బిజినెస్ లో చేర్చారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మూడు రోజులపాటు పార్లమెంట్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. అవిశ్వాస తీర్మానంపై చర్చకు 10 గంటలకు పైగా సమయం కేటాయించారు. స్పీకర్ తొలగింపు ప్రక్రియను ఆర్టికల్ 94సి లో స్పష్టంగా పొందుపరిచారు. దాని ప్రకారం అవిశ్వాస తీర్మానం సాధారణ మెజారిటీతో నెగ్గితే స్పీకర్ ఉద్వాసనకు గురవుతారు. అవిశ్వాస తీర్మానం కోసం నోటీసివ్వడంతో ఈ ప్రక్రియ మొదలవుతుంది. రాజ్యాంగ పదవులు, సంస్థలను అగౌరవపరచడంలో కాంగ్రెస్ పాత్రను హైలైట్ చేయాలని బీజేపీ, ఎన్డీఏ ఎంపీలు నిర్ణయించారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించడం,ప్రతిపక్ష నేతను మాట్లాడనియకపోవడం,ఎంపీల సస్పెన్షన్,బిజెపి ఎంపీలకు అనుకూలంగా స్పీకర్ వ్యవహరించిన అంశాలను కాంగ్రెస్,విపక్ష ఎంపీలు లేవనెత్తనున్నారు.స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు సభకు ప్యానెల్ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, డీఎంకే,ఆర్జేడీ,వామపక్షాలు,శివసేన, ఎన్సిపీ, తృణమూల్ కాంగ్రెస్ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వనున్నాయి. స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందాలంటే లోక్ సభ సంఖ్యాబలంలో సభకు హాజరైన వారిలో సగానికి పైగా ఎంపీలు తీర్మానానికి మద్దతు తెలపాలి. అయితే ప్రస్తుతం ఎన్‌డీఏకు బలమైన మెజారిటీ ఉండటంతో తీర్మానం ఆమోదం పొందే అవకాశం లేదు. ఇటీవల కోటా ఎయిర్ పోర్టు శంకుస్థాపన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్పీకర్ ఓం బిర్లాను అత్యంత నిష్పక్షపాతంగా, గౌరవప్రదంగా, సభను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.స్పీకర్‌పై ఇప్పటికే దాకా మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు పెట్టినా, రెండుసార్లు ఓటింగ్ దాకా వచ్చినా అవి వీగిపోయాయి. ఓటింగ్‌కు హాజరైన ఎంపీలలో సగానికంటే ఎక్కువ ఓట్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల తీర్మానం వీగిపోయింది. గతంలో స్పీకర్లు జీవీ మౌలాంకర్ (1954), హుకుంసింగ్ (1966), బలరాం జాఖడ్ (1987)పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాలిచ్చినా అవి వీగిపోయాయి.స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం పాస్ కావాలంటే రాజ్యాంగం ఆర్టికల్ 94(ఇ) ప్రకారం సభలో హాజరైన, ఓటు వేసిన సభ్యులలో సాధారణ మెజారిటీ సగానికంటే ఎక్కువ అవసరం. అంటే అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందాలంటే 273 మంది మద్దతు అవసరం ప్రస్తుతం ఇండియా బ్లాక్ మొత్తం బలం సుమారు 234 సీట్లు విపక్షాలు అన్నీ ఓటు వేసినా మెజారిటీని దాటలేవు దీంతో తీర్మానం వీగిపోయే అవకాశమే ఎక్కువ.

అధికార ఎన్‌డీఏ బలం సుమారు 293 సీట్లుగా ఉంది. దీనికి తోడు ఎన్డీఏ లో లేని పార్టీలు వైసీపీ, శిరోమణి అకాలీదళ్, స్వతంత్ర ఎంపీల మద్దతు కలిస్తే అధికార పక్షం బలం 300 పై మార్కుకు చేరుతుంది. ఎన్‌డీఏకు బలమైన సంఖ్యాబలం ఉండటంతో స్పీకర్ ఓం బిర్లా ఆయన స్థానంలో కొనసాగే అవకాశమే ఎక్కువగా ఉంది

## అజార్ కు పదవీ గండం

హైదరబాద్ అజహరుద్దీన్ ను హడావుడిగా మంత్రిని చేశారు. ఆరు నెలల్లో ఎమ్మెల్యేగానో ఎమ్మెల్సీగానో ఎంపిక కావాలి. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ వద్ద దానికి సంబంధించిన ప్లాన్ ఏ లేదా ప్లాన్ బీ ఏదీ ఉన్నట్లుగా కనిపించడం లేదు. మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత గవర్నర్ కోటాలో ఆయన పేరును ఎమ్మెల్సీకి సిఫారసు చేశారు. విషయం కోర్టులో ఉండటంతో.. ఇంత వరకూ గవర్నర్ నిర్ణయం తీసుకోలేదు. పైగా కొత్త గవర్నర్ వస్తున్నారు. ఆయన కూడా నిర్ణయం తీసుకోకపోతే అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి ఉంటుంది.మైనారిటీ కోటాలో మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అజహర్, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల లోపు ఏప్రిల్ 30, 2026 నాటికి అసెంబ్లీ లేదా కౌన్సిల్ సభ్యుడిగా ఎంపిక కావాల్సి ఉంది. ఈ ప్రక్రియలో ఎదురవుతున్న న్యాయపరమైన చిక్కులు ఆయన మంత్రి పదవిని సందిగ్ధంలో పడేశాయి.అజహరుద్దీన్‌ను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేస్తూ ప్రభుత్వం గతంలోనే సిఫారసు చేసింది. అయితే, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సిఫారసు చేసిన పేర్లను గవర్నర్ తిరస్కరించడంపై దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సుప్రీంకోర్టు పరిధిలో ఉండటంతో, గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అజహర్ నియామకంపై నిర్ణయం తీసుకోలేకపోయారు. ఇప్పుడు కొత్త గవర్నర్ రాకతో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతానికి గవర్నర్ కోటానే ప్లాన్ ఎగా భావిస్తున్న కాంగ్రెస్ హైకమాండ్ వద్ద ప్లాన్ బిపై స్పష్టత లేకపోవడం పార్టీ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. ఒకవేళ కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే, ఎమ్మెల్యే కోటాలో ఉన్న ఎమ్మెల్సీలలో ఒకరిని రాజీనామా చేయించి ఆ స్థానంలో అజహర్‌ను పంపే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే, సిట్టింగ్ ఎమ్మెల్సీలు ఎవరైనా తమ పదవిని వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం వంటి ప్రత్యామ్నాయాలు చర్చకు వచ్చినా, అక్కడ ఎన్నికల నిర్వహణకు సమయం సరిపోదు.రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న మరో ఆసక్తికరమైన చర్చ ఏమిటంటే.. ఒకవేళ ఏప్రిల్ 30లోగా ఎమ్మెల్సీ పదవి దక్కకపోతే, అజహర్ మంత్రి పదవికి రాజీనామా చేసి, మళ్ళీ ఒకటి రెండు రోజుల తర్వాత తిరిగి ప్రమాణ స్వీకారం చేయడం. దీనివల్ల ఆయనకు మరో ఆరు నెలల గడువు లభిస్తుంది. అయితే, ఇలా చేయడం వల్ల ప్రభుత్వం తీవ్రమైన విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పైగా, సుప్రీంకోర్టు గతంలో ఇటువంటి పదే పదే ప్రమాణ స్వీకారాలను తప్పుబట్టిన ఉదంతాలు ఉండటంతో, ఈ నిర్ణయం తీసుకుంటే పరువు పోయే ప్రమాదం ఉందని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. మైనారిటీ ప్రాతినిధ్యం కోసం హడావుడిగా అజహర్‌ను మంత్రిని చేసిన రేవంత్ రెడ్డి సర్కారు, ఇప్పుడు ఆయనను చట్టసభలకు ఎలా పంపాలనే విషయంలో సరైన ప్రణాళిక లేకపోవడంతో చిక్కుల్లో పడింది.

## ట్రెండింగ్ బ్రిడ్జిగా సంతోషనగర్ స్టీల్ బ్రిడ్జి

హైదరబాద్ హైదరాబాద్ లోని చంచల్‌గూడ టూ సంతోషన్ నగర్ ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు నిర్మిస్తున్న సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జ పూర్తవ్వకముందే తెలుగు రాష్ట్రాల్లో ట్రెండింగ్ బ్రిడ్జిగా వార్తల్లో నిలిచింది. ఒళ్లు గగుర్పొడిచేలా, అత్యంత ప్రమాదకరంగా సాగుతున్న బ్రిడ్జ్ నిర్మాణ పనులు, సేఫ్టీ లేకుండా బ్రిడ్జ్ పై కార్మికులు చేస్తున్న విన్యాసాలు, అత్యంత బరువైె గిడ్డర్లును బ్రిడ్జిపై తీసుకెళ్తున్న వీడియోలు పెను దుమారం రేపాయి. కార్మికుల ప్రాణాలతోపాటు తేడా వస్తే బ్రిడ్జి క్రింద ప్రయాణిస్తున్న వాహనదారులు తలలు కూడా పుచ్చకాయల్లా పగిలేలా ఉన్నాయంటూ వీడియోలు వైరల్ అయ్యాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం ట్విట్టర్ వేదికగా స్టీల్ బ్రిడ్జ నిర్మాణ పనులపై తీవ్ర విమర్శలు చేశారు. సీన్ కట్ చేస్తే ఇప్పుడు బ్రిడ్జ్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ముఖ్యంగా గిడ్డర్లు వంటి అత్యంత బరువైన ఇనుప పిల్లర్ల అమరిక రాత్రి వేళల్లో ఎవరి కంట పడకుండా చేసేందుకు నిర్మాణ సంస్థ సిద్దమైయ్యింది.ఇంతలా వార్తల్లో చక్కర్లు కొట్టిన సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జి, ఇక్కడ స్థానికులకు మాత్రం దశాబ్దాల నాటి కల. సంతోష్ నగర్ టూ సైదాబాద్ మీదుగా చంచల్ గూడ వెళ్లాలంటే కేవలం 3 కిలోమీటర్ల దూరం 30 నుండి 40 నిమిషాలకు పైగా సమయం పట్టేది. అంతలా ట్రాఫిక్ కష్టాలతో ఇక్కడ వాహనదారులు పట్టపగలే చుక్కలు చూసేవారు. ఈ స్టీల్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయితే కేవలం ఐదే ఐదు నిమిషాల్లో రివ్వుమంటూ దూసుకుపోవచ్చంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ సిటీలో సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జ్ రెండవ అతి పెద్ద స్టీల్ బ్రిడ్జి కావడం మరో ప్రత్యేకతగా చెప్పవచ్చు. సంతోష్ నగర్, యాదగిరి సినిమా థియేటర్ వద్ద నుండి మొదలై, చంచల్ గూడ జైలు దాటే వరకూ 3.8 కిలోమీటర్ల మేర ఈ బ్రిడ్జి నిర్మాణం, మూడు ట్రాఫిక్ సిగ్నల్స్ దాటి, చంచల్ గూడ జంక్షన్ మీదుగా వెళుతుంది. అత్యంత రద్దీగా ఉంటే నల్గొండ ఎక్స్ రోడ్ మీదుగా సంతోష్ నగర్ వైపు వచ్చే వాహనదారులకు ఈ నిర్మాణం పూర్తయితే ట్రాఫిక్ కష్టాలకు మోక్షం లభించినట్లే..650 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ స్టీల్ బ్రిడ్జ్ కు గత బీఆర్ఎస్ హయాంలోనే శంకుస్థాపన చేశారు. నాలుగేళ్ల క్రితమే పనులు ప్రారంభమైనా తీవ్ర జాప్యం జరుగుతోంది. అతి కష్టం మీద నిర్మాణ పనులు ఓ కొలిక్కి వచ్చాయనుకుంటున్న సమయంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో వార్తల్లోకెక్కింది సంతోష్ నగర్ స్టీల్ బ్రిడ్జ్. ఈ స్టీల్ బ్రిడ్జ్ పూర్తయితే సైదాబాద్ నుండి సంతోషనగర్ వైపు వచ్చే వాళ్లు, ఇక్కడి నుండి చంపాపేట్, సైదాబాద్ వెళ్లాలన్నా మూడు ప్రధాన మార్గాలకు పెద్ద జంక్షన్ కావడంతో ఈ బ్రిడ్జ్ వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. ఇబ్రహీంపట్నం బస్సులు మిధాని వెళ్లాలన్నా, కోటి వెళ్లాలన్నా ఇదే ప్రధాన రహదారి.సైదాబాద్ లో ఇరుకు రోడ్లు, ఇక్కడ మార్గెట్ కూడా నిత్యం రద్దీగా ఉంటం వల్ల , ఈ బ్రిడ్జి పూర్తయితే 90శాతం ఈ ప్రాంతంలో ట్రాఫిక్ తగ్గిపోతుంది. సంతోష్ నగర్ టూ మలక్ పేట్ ఇప్పుడు 5నిమిషాల్లో వెళ్లిపోతారు. గతంలో గంట సమయం పట్టేది. - విజయేంద్ర రెడ్డి, సంతోష్ నగర్..ఆర్టీసీ బస్సులు, నల్గొండ వెళ్లే వాహనాలు ఈ రహదారి మీదుగా వెళుతుండటంతో ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య విపరీతంగా ఉంది. రోడ్ క్రాస్ చేసేవాళ్లు అనేసార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. స్టీల్ బ్రిడ్జ్ పూర్తయితే చాల ఉపయోగం ఉంటుంది. మలక్ పేట్ , చాదర్ ఘాట్ మార్గాల్లో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టినట్లవుతుంది. వివిధ జిల్లాల నుండి వచ్చేవాళ్లకు సైదాబాద్ మార్కెట్ కు రావాలంటే నరకం చూసేవాళ్లు. ఇప్పుడు ఆ పరిస్దితి మారుతుంది. - ఎం.ఏ. రజాక్, సైదాబాద్..

మాధన్నపేట వద్ద విపరీతంగా ట్రాఫిక్ జామ్ అవుతుంది.స్కూల్స్, ఇంజరీరింగ్ కాలేజీలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ స్టీల్ బ్రిడ్జ్ పూర్తయితే చాలా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా సంతోష్ నగర్ నుండి మలక్ పేట్ వెళ్లాలంటే ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడో పూర్తవ్వాల్సిన ఈ బ్రిడ్జ్ నిర్మాణం ఇన్నాళ్లు పట్టింది. సాధ్యమైనంత త్వరగా రాకపోకలు ప్రారంభించాలని కోరుకుంటున్నాము. -

## అమ్మకానికి పాత వాహానాలు

హైదరబాద్ తెలంగాణలో పాతబడిన వాహనాలపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. కాలుష్యం పెరగడం, రోడ్లపై ప్రమాదాలు ఎక్కువవడం వంటి సమస్యలకు పాత వాహనాలు ఒక కారణంగా మారుతున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసే విధానాన్ని పూర్తిగా మార్చాలని నిర్ణయించింది. ఇప్పటి వరకు మాన్యువల్‌గా జరిగే తనిఖీలకు బదులుగా పూర్తిగా సాంకేతిక ఆధారిత వ్యవస్థను తీసుకురావాలని తెలంగాణ రవాణాశాఖ ముందుకు వచ్చింది.ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం అయ్యాయి. మొత్తం 37 కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రతి జిల్లా కేంద్రంలో ఒక స్టేషన్ ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో అదనంగా మరికొన్ని కేంద్రాలను ఏర్పాటు చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. త్వరలోనే టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.ఈ కొత్త వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి కానుంది. ఇప్పటివరకు మోటారు వాహనాల ఇన్‌స్పెక్టర్లు చేసే తనిఖీలపై అనేక విమర్శలు ఉన్నాయి. కొన్నిసార్లు పూర్తిస్థాయి పరీక్షలు లేకుండానే ఫిట్‌నెస్ పత్రాలు జారీ అయ్యేవని ఆరోపణలు వచ్చాయి. దీంతో రోడ్లపై సరిగా పనిచేయని వాహనాలు తిరుగుతున్నాయని అధికారులు గుర్తించారు.

ఈ సమస్యను పూర్తిగా నివారించేందుకు ఆటోమేటెడ్ టెస్టింగ్ విధానాన్ని తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది.కొత్త విధానంలో వాహనదారులు ముందుగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సమయాన్ని బుక్ చేసుకోవాలి. ఆ తర్వాత వాహనాన్ని టెస్టింగ్ స్టేషన్‌కు తీసుకెళ్లాలి. అక్కడ అత్యాధునిక పరికరాలతో వాహనాన్ని పరీక్షిస్తారు. అన్ని పరీక్షల్లో వాహనం సరైన ప్రమాణాలు కలిగి ఉందని తేలితే కంప్యూటర్ వ్యవస్థే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తుంది. మొత్తం ప్రక్రియ చాలా తక్కువ సమయంలో పూర్తయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు.ఈ స్టేషన్ల ఏర్పాటు కోసం ప్రభుత్వం ఇప్పటికే భారీ నిధులను మంజూరు చేసింది. రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.296 కోట్లతో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని నిర్ణయించింది. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ విధానం అమల్లోకి వస్తే వాహనాల తనిఖీల్లో పారదర్శకత పెరగడంతో పాటు రోడ్లపై తిరిగే వాహనాల స్థితి కూడా మెరుగుపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా కాలుష్యాన్ని నియంత్రించడం, ప్రమాదాలను తగ్గించడం వంటి లక్ష్యాలతో ఈ కొత్త వ్యవస్థను తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

## భారత జట్టు విజయం తిరుపతిలో సంబరాలు

తిరుపతి టి-20 వరల్డ్ కప్లో భారత్ మరోసారి తన సత్తా చాటింది. న్యూజిలాండ్పై ఘన విజయం సాధించిన టీం ఇండియాకు దేశవ్యాప్తంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విజయం నేపథ్యంలో తిరుపతి నగరంలో అభిమానులు సంబరాలు అంబరాన్నంటించారు. న్యూజిలాండ్పై భారత్ విజయం సాధించడంతో తిరుపతి నగరంలో క్రికెట్ అభిమానులు భారీగా సంబరాలు జరుపుకున్నారు.

చిన్నా పెద్దా తేడా లేకుండా అభిమానులు వీధుల్లోకి వచ్చి బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరు స్వీట్లు పంచుతూ టీం ఇండియాకు అభినందనలు తెలిపారు.

టీం ఇండియా వరుసగా రెండోసారి టి-20 వరల్డ్ కప్పు కైవసం చేసుకోవడంతో అభిమానుల్లో ఆనందం రెట్టింపైంది. మొత్తం మీద ఇది భారత్కు మూడోసారి టి-20 వరల్డ్ కప్ విజయం సాధించింది..

## 40 డిగ్రీలు దాటేసిన ఎండలు

ఖమ్మం తెలంగాణలో భానుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. నేడు కూడా పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ ఏడాది ఎండలు మండిపోతాయని.. వడ గాలులు వీచే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అంటున్నారు.తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మార్చి మె?దటి వారంలోనే నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. భానుడి భగభగలు, తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 8 గంటల నుంచే సూర్యుడు సుర్రుమంటున్నాడు. పది తర్వాత రోడ్లపైకి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. నేడు (మార్చి 8) హైదరాబాద్ నగరంలో పాటు చాలా జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతాయని చెప్పారు.

ఖమ్మం, మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 40 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. ఆకాశం పూర్తిగా నిర్మలంగా ఉండటం వల్ల సూర్యరశ్మి నేరుగా భూమిని తాకుతుందని..

మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తీవ్రమైన ఉక్కపోత, వేడి ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ సమయంలో బయటకు రాకుండా ఉంటేనే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.తెలంగాణలోని ఉత్తర, తూర్పు జిల్లాల్లో ఎండ ప్రభావం మరీ ఎక్కువగా ఉండనుందని చెప్పారు. నిజామాబాద్, ఆదిలాబాద్, రామగుండం ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఇప్పటికే 36 డిగ్రీల మార్కును దాటాయని చెబుతున్నారు. నేడు ఈ జిల్లాల్లో పొడి గాలులు వీచే అవకాశం ఉందని.. ఇక్కడ కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని చెబుతున్నారు. ఈ మేరకు ఎండ తీవ్రత నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణిలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తగా ఉండాలంటున్నారు.ఆహారం విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని తేలికపాటి త్వరగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలని పండ్ల రసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వలంటున్నారు. దాహం వేయకపోయినా తరుచూ నీళ్లు తాగాలని తద్వారా శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాదని అంటున్నారు. మసాలా ఫుడ్స్, మద్యం, సిగరెట్లకు దూరంగా ఉండాలని చెబుతున్నారు.

## మహిళ ఉద్యోగిపై ఎంపిడివో చిందులు

కాకినాడ మహిళా దినోత్సవానికి ముందు రోజే మహిళా ఉద్యోగిపై కాకినాడ రూరల్ ఎంపిడిఓ సతీష్ వేధింపుల ఘటన బయటపడింది. తోటి ఉద్యోగుల ఎదుటే మహిళా ఉద్యోగిపై కేకలు, అరుపులు, తీవ్రంగా మందలించండంతో మహిళా ఉద్యోగి కూలబడిపోయింది. యూఎఫ్ఎస్ సర్వే సక్రమంగా చేయడంలేదని రమణయ్యపేట సచివాలయం మహిళా పోలీస్ పై ఆగ్రహావేశాలు ఎంపిడివో వ్యక్తం చేసారు. ?

సస్పెండ్ చేస్తానని అప్పుడే మీరు సక్రమంగా పనిచేస్తారా? అంటూ మందలించారు. తోటి ఉద్యోగుల ముందే కించపరచడంతో మహిళా కానిస్టేబుల్ తీవ్రంగా మనస్థాపానికి గురైయింది. కించపరచడంతో ఎంపిడిఓ కార్యాలయం నుండి ఏడ్చుకుంటూ ఎక్కిఎక్కి ఏడ్చి కూలబడిపోయింది. మనస్థాపంతో ఫిట్స్ రావడం, నేలపై కూలబడిన మహిళా ఉద్యోగికి తోటి ఉద్యోగులు సపర్యలు చేసారు

## సైలెంట్ మూడ్ లోకి అసంతృప్తినేతలు

హైదరాబాద్ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు ఒక వింతైన, అద్భుతమైన “శాంతియుత” వాతావరణం నెలకొంది. నిన్నటి వరకు గొంతు చించుకుంటూ, రేవంత్ రెడ్డి నిర్ణయాల మీద రచ్చ చేసిన ‘ఫైర్ బ్రాండ్’ నేతలంతా.. ఇప్పుడు ఎక్కడో లోతైన ధ్యానంలోకి వెళ్ళిపోయారు. రేవంత్ రెడ్డి తీసుకున్న ఒక్క ‘రాజ్యసభ’ నిర్ణయంతో, ఈ సీనియర్లందరికీ అకస్మాత్తుగా ‘మౌన వ్రతం’ పట్టినంత జ్ఞానోదయం కలిగింది!గతంలో కాంగ్రెస్ అంటే “ఢిల్లీ వెళ్లాలి, ఫిర్యాదు చేయాలి, వేచి చూడాలి” అనే సామెత ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. తెలంగాణ కాంగ్రెస్ దగ్గరకు వచ్చేసరికి “హైకమాండ్” అంటే సాక్షాత్తు రేవంత్ రెడ్డేనని పార్టీ నేతలందరూ సర్టిఫై చేసేసుకున్నారు. వేం నరేందర్ రెడ్డిని రాజ్యసభకు పంపి, “ఢిల్లీలో నా మాటే శాసనం” అని రేవంత్ తన మార్క్ పాలిటిక్స్‌తో స్పష్టమైన మెసేజ్ ఇచ్చేశారు. ఇంకేముంది? సీనియర్లందరూ తమ అసమ్మతి ఫైళ్లను అటక మీద పెట్టేసి, ఏసీ గదుల్లో కూర్చొని “రేవంత్ జిందాబాద్” అంటూ కంఠాపాఠం మొదలుపెట్టారు.ఎప్పుడూ ఏదో ఒక సంచలనం సృష్టించే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లాంటి నేతలు సైతం, ఇప్పుడు “నోరు మెదపకపోవడమే మంచిది” అన్న యోగాసనంలో ఉన్నారు. తెర వెనుక వ్యూహాలు పన్నిన నేతలు కూడా, రేవంత్ చక్రవ్యూహం ముందు తాము కేవలం ‘పావులమే’ అని గుర్తించినట్టున్నారు. ఇప్పుడు వారికి రెండు ఆప్షన్లే ఉన్నాయి:రేవంత్ పాలనను ఆకాశానికి ఎత్తేస్తూ, మీడియా మైకుల ముందు ‘స్తుతి’ పాడటం.ఈ రెండింటిలో ఏది ఎంచుకున్నా, వారి రాజకీయ భవిష్యత్తుకు రేవంత్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చే అవకాశం ఉందన్నది లోకల్ టాక్. ఒకప్పుడు గ్రూపు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న కాంగ్రెస్.. ఇప్పుడు రేవంత్ సారథ్యంలో ‘కార్పొరేట్ కంపెనీ’లా మారిపోయింది. టార్గెట్స్ రీచ్ అవ్వండి, లేదంటే ప్రమోషన్లు ఆగిపోతాయ్ అన్నట్టుగా ఆయన డీల్ చేస్తుంటే, సీనియర్లు అవాక్కవుతున్నారు. రేవంత్ రెడ్డి తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలకు ఢిల్లీ అధిష్టానం కూడా ‘యెస్ బాస్’ అనక తప్పడం లేదు.మొత్తానికి తెలంగాణ కాంగ్రెస్‌లో ‘కలహాల’ కాలం ముగిసి, ‘రేవంత్ శకం’ మొదలైంది. అసమ్మతి నేతలు ఇప్పుడు “మాకు అసంతృప్తి లేదు.. కేవలం విశ్రాంతి తీసుకుంటున్నాం” అని చెప్పుకోవడమే ఇప్పుడున్న ఏకైక మార్గం!

## టిప్పర్‌కు తగిలిన విద్యుత్ తీగలు లారీ దగ్ధం

నల్గొండ నల్లగొండ జిల్లాలో తృటిలో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు నిర్మాణ పనుల కోసం కంకరతో వెళ్తున్న ఓ టిప్పర్ లారీకి విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో లారీ వెనుక భాగం పూర్తిగా దగ్ధమైంది. అదే సమయంలో కరెంట్ షాక్ తగలడంతో లారీ డ్రైవర్ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. అయితే సమీపంలో ఉన్న స్థానికులు వెంటనే స్పందించి ప్రాణాలకు తెగించి డ్రైవర్ను లారీ దగ్గర నుంచి బయటకు లాగి సురక్షిత ప్రదేశానికి తరలించారు. దీంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పినట్లైంది.ఈ ఘటన నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రోడ్డు నిర్మాణ పనుల కోసం కంకర తీసుకెళ్తున్న సమయంలో ప్రమాదవశాత్తు లారీపై ఉన్న ఎత్తైన లోడుకు విద్యుత్ తీగలు తగిలినట్లు సమాచారం. ఒక్కసారిగా లారీ నుంచి మంటలు ఎగిసిపడటంతో పాటు దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. స్థానికులు వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక సిబ్బందికి, అధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం డ్రైవర్ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# యువతులను రహస్యంగా ఫోటోలు తీస్తున్న యువకుడు అరెస్టు

మంగళగిరి సీక్రెట్గా ఫొటోలు తీస్తున్న వ్యక్తిని రెడ్హ్యాండ్గా ఒక యువతి పట్టుకుంది. బస్ షెల్టర్ వద్ద వేచి ఉన్న విద్యార్థినులను అంజి అనే వ్యక్తి రహస్యంగా ఫొటోలు తీస్తుండగా ఓ యువతి గమనించింది. అతని ఫోన్ పరిశీలించగా అనేకమంది యువతుల ఫొటోలు, వీడియోలు బయటపడ్డాయి. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం తమ్మపూడి వద్ద ఘటన జరిగింది.

# గోదావరి లో దూకి యువతి ఆత్మహత్యాయత్నం

యానం యానాం ఎదురులంక జిఎంసి బాలయోగి వారధి పైనుండి గోదావరిలో దూకి 18 సంవత్సరాల వివాహిత యువతి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన మత్స్యకారులు రక్షించి యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలు ద్రాక్షారామం గ్రామానికి చెందిన పెట్టా సత్యలక్ష్మి గా గుర్తించారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలు తెలియవలసి ఉంది.

# గ్రేటర్ వరంగల్లో డీజిల్ లేక నిలిచిపోయిన బల్దియా వాహనాలు

వరంగల్ గ్రేటర్ వరంగల్ లో మునిసిపల్ వాహనాలు ఇంధనం కొరతలో నిలిచిపోయాయి. రూ.2.50కోట్ల మేర పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లిస్తేనే ఇంధనం పోస్తామని బంకుల యజమానులు అంటున్నారు.గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ బల్దియా వాహనాలకు సెంట్రల్ జైలు ఆధ్వర్యంలో నడుపుతున్న పెట్రోల్ బంక్ నుంచి అందుతున్న డీజిల్, పెట్రోల్ సరఫరాను జైళ్ల శాఖ అధికారులు నిలిపివేసారు. జీడబ్ల్యూఎంసీ రూ.2.50కోట్ల వరకు బకాయి ఉండడంతో బల్దియా చెత్త తరలింపు వాహనాలు, దోమల నియంత్రణకు ఉపయోగించే ఫాగింగ్ మిషన్లకు అందించే ఇంధనాన్ని నిలిపివేసారు. పాత బిల్లులు చెల్లిస్తేనే పెట్రోల్, డీజిల్ అందిస్తామని, లేదంటే ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని సిబ్బంది కరాఖండిగా చెబుతున్నారు. దీంతో గత కొన్ని రోజులుగా నగరంలో చెత్త పేరుకుపోతోంది.

# 5 కె రన్ నిర్వహించిన మంత్రి పొన్నం

హుస్నాబాద్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో 5 కే రన్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ లు ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గోన్నారు. ఈ 5 కే రన్ లో భారీగా పాల్గొన్న విద్యార్థులు , పట్టణ ప్రజలు భారీగా హాజరయ్యారు.మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ లో భాగంగా మార్చి 6 నుండి జూన్ 12 వరకు కార్యక్రమాలు చేస్తుంది. ఈరోజు 5 కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. మనం అనారోగ్యానికి గురి కాకుండా మనం నివసించే ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. గ్రామ పంచాయతీ,నగర పాలక ప్రజా ప్రతినిధులు ఇందులో భాగస్వాయమై ప్రజలను చైతన్యపరచాలి. అనేక అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి హుస్నాబాద్ మున్సిపాలిటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. హుస్నాబాద్ స్వచ్ఛత కార్యక్రమంలో పాలకవర్గం తీసుకున్న ఏ కార్యక్రమంలో అయినా ప్రజలంతా పాల్గొనాలి. మీరు నివసిస్తున్న ప్రాంతాలు , వార్డుల్లో పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు , ఉదయం లేవగానే శారీరక వ్యాయామం చేయాలి. మన ఇళ్లలో పాడైపోయిన టీవీ , ఫ్రిడ్జి ,వాషింగ్ మిషన్స్ ఇలా ఈ వ్యర్థాల సేకరించి రీసైక్లింగ్ పంపించాలి. మీ ఇంట్లో వృథాగా ఉన్న వస్తువులు వెంటనే తొలగించాలి... శానిటేషన్ చేయాలి.హుస్నాబాద్ లో ఉన్న ఖాళీ స్థలాల్లో నీళ్ళు నిల్వ ఉండి దోమల బెడద కు కారణమవుతున్నాయి.. వాటిని నివారించాలి. ప్రతి రోజోక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ 99 రోజుల పాటు ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలి. డ్రింకింగ్ వాటర్ సమస్య, డ్రైనేజీ ఇతర ఏ సమస్యలు ఉన్న మున్సిపల్ నుండి పరిష్కారం అవుతాయి. రాబోయే వేసవికాలం లో తాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.. నీటిని పొదుపుగా వాడుకోవాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి.. ఆరోగ్యంగా ఉండేలా వైద్య పరీక్షలు నిర్వహించాలి. క్రీడల నిర్వహణ,యువజన కార్యక్రమాలు చేయాలి. జూన్12 వరకు జరిగే ఈ కార్యక్రమాల్లో హుస్నాబాద్ నియోజకవర్గం అగ్రగామిగా ఉండాలనిఅన్నారు.

# రాష్ట్రం పురోగతి సాధించాలి



తిరుమల కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రంలో శ్రీవారిని దర్శించుకోవడం పరమ పవిత్ర అనుభూతిని ఇచ్చిందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సూర్య విక్రమాదిత్య ? సాక్షి లకు ఆయురారోగ్యాలు కలగాలని, అలాగే తెలుగు రాష్ట్రాల ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆయన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రార్థించారు. త్వరలో అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ద్వారా తెలంగాణ రాష్ట్రం ఆర్థిక, సామాజిక రంగాల్లో మరింత పురోగతి సాధించి, విజన్ 2047లక్ష్యంగా ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదగాలని భట్టి విక్రమార్క స్వామివారిని కోరుకున్నారు.

# విశాఖ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

విశాఖపట్నం విశాఖ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. సీఎం చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం పై వైకాపా నేతలు, కార్యకర్తలు వ్యతిరేక నినాదాలు చేసారు. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుందని కలెక్టరేట్ ఎదుట బైఠాయించారు,. అక్రమంగా ప్రభుత్వ భూమిని ఎంపీ శ్రీ భరత్ కు కట్టబెట్టడాన్ని ఖండిస్తున్నామని అన్నారు.

# కొత్తగూడెంలో ప్రభుత్వ టీచర్ హత్య



కొత్తగూడెం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం వన్ టౌన్ పరిధిలో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు కవిత మృతి చెందింది. మృతురాలి భర్త నాగేశ్వరరావుకు తన వదినతో వివాహేతర సంబంధం ఉందని, ఈ విషయంలోనే భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. భర్త నాగేశ్వరరావే కవితను హత్య చేశాడని పేర్కొన్నారు. ఈ మేరకు మృతురాలి కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు

# టీడీపీకి కార్యకర్తలే నిజమైన హీరోలు

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపు బాధ్యత మీదే.**

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత టిడిపి కార్యకర్తలే బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవాలి.**

**పార్టీ అభ్యున్నతికి మీరే స్పూర్తిగా నిలవాలి.**

**డిసిసిబి చైర్మన్ ఎం సూర్యనారాయణ రెడ్డి**



**బద్వేలు** తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే నిజమైన హీరోలని డిసిసిబి చైర్మన్ ఎం సూర్య నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కార్యకర్తల కృషియే ప్రధాన కారణం అన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన టీడీపీ కార్యకర్తల సేవలను వినియోగించుకుంటామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుకు కీలక పాత్ర పోషించాలని ఆయన కోరారు పార్టీ అభ్యున్నతికి కార్యకర్తలే నిజమైన హీరోలని ఆయన అన్నారు. ప్రస్తుతం రాబోయే కార్పొరేషన్ మున్సిపల్ జిల్లా పరిషత్ మండల పరిషత్ పంచాయతీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులే గెలుపొందేలా క్షేత్రస్థాయిలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వ హయాంలో చేసిన ఆర్థిక విధ్వంసం తో పాటు రాష్ట్ర వెనుకబాటుకు కారణమైన విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కూటమి ప్రభుత్వ అభివృద్ధికి టిడిపి కార్యకర్తలే గ్రామాల్లో బ్రాండ్ అంబాసిడర్లుగా పని చేయాలని చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి పిలుపునిచ్చారు.

# విద్యార్థికి గుండు కొట్టించిన ప్రిన్సిపల్

మియాపూర్ మియాపూర్ హఫీజ్ పేట్ లో దారుణం జరిగింది. జుట్టు ఎక్కువగా ఉందని విద్యార్థికి ప్రిన్సిపాల్ గుండు కోట్టించిన ఘటన వివాదానికి దారి తీసింది. మొక్కు ఉండగా తమ కుమారుడికి గుండు కోట్టించడంపై స్కుల్ ముందు విద్యారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ప్రేం నగర్ బిబ్లాక్ లోని బ్లాక్ బోర్డు ది స్కూల్ లో ఈశ్వర్ అనే విద్యార్థి తొమ్మిదోవ తరగతి చదువుతున్నాడు. జుట్టు ఎక్కువగా ఉండటంతో జట్టు కత్తింరించుకోవాలని స్కూల్ ప్రిన్సిపాల్ సూచించారు. లక్ష్మి నరసింహ స్వామి మొక్కు ఉందని స్కుల్ ప్రిన్సిపాల్ కు మొక్కు ఉందని విద్యార్థి చెప్పాడు. దాంతో ప్రిన్సిపల్ మరుసటి రోజు బలవంతంగా విద్యార్థికి గుండు కోట్టించారు. .

# ఎక్కడైతే ఇల్లు కూల్చరో అక్కడే ఇల్లు ఇవ్వాలి

ఖమ్మం ఒక్క ఆడబిడ్డ ఏడిస్తే ఇంటికి మంచిది కాదు, ఇంతమంది ఏడిస్తే ప్రభుత్వానికి మంచిది కాదు. రాత్రికి రాత్రే వచ్చి బుల్డోజర్ లతో వచ్చి ఇల్లు కూల్చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు.సోమవారం ఆమె భూదాన్ భూ నిర్వాసితులను పరామర్శించారు. తరువాత ఆమె మీడియాతో మాట్లాడారు. కొంతమంది, రాజకీయ పార్టీలు ఎగ్జిబిషన్ కు వచ్చినట్లే వచ్చారు. ఒకరోజు మీ దగ్గరకు వస్తాను వస్తే మీకు సొల్యూషన్ చేసి పోత. మనల్ని ఇక్కడకు తొలారు అంతే, మహిళలకు, మగవారికి ప్రత్యేకంగా శిబిరం ఇవ్వలేదు. బీఆర్ఎస్ పార్టీ తమ పాపం కడుక్కునేందుకు వచ్చారు. జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ఇచ్చారు ఒక్కరు కూడా ఇక్కడకు రాలేదు, ఇంతవరకు జిల్లా కలెక్టర్ రాలేదు. ఎక్కడైతే ఇల్లు కూల్చరో అక్కడే ఇల్లు ఇవ్వాలి. డబుల్ బెడ్ రూం ఇళ్లు, ఎక్కడో ఇల్లు ఇస్తామంటే సహించేది లేదు. పేదవారి మీద జులుం నడుస్తుంది. బుల్డోజర్ లు వస్తున్నాయి పేదవారిని అన్యాయం చేస్తున్నారు. అందరం కలిసి ఒక కార్యాచరణ రూపొందించి పని చేద్దామని అన్నారు.

# పెళ్లి ఒత్తిడి విధి నిర్వహణలోనే తనువు చాలించిన వైద్యురాలు



పాలకొల్లు వృత్తిరీత్యా ఎంతో మందికి ప్రాణదానం చేయాల్సిన ఒక యువ వైద్యురాలు అర్ధాంతరంగా తనువు చాలించడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. కుటుంబ సభ్యులు కుదిర్చిన వివాహం చంద్రరేఖ కు ఇష్టం లేకపోవడమే ప్రధాన కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. పెళ్లి విషయంలో గత కొద్దిరోజులుగా చంద్రరేఖ తీవ్ర మానసిక ఒత్తిడికి లోనైనట్లు సమాచారం. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురైన ఆమె విధి నిర్వహణలో ఉంటూనే ప్రాణాంతక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఆసుపత్రి ప్రాంగణంలో ఆమె కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. తోటి సిబ్బంది సైతం ఆమె మృతిని జీర్ణించుకోలేకపోతున్నారు. వైద్యురాలి ఆకస్మిక మృతి స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.

# శాఖల వారీగా ప్రజావాణి దరఖాస్తుల సమీక్ష

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



కరీంనగర్ ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని, శాఖల వారీగా సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. అధికారులు ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యతనిస్తూ వెను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.వారి పరిధిలో లేని దరఖాస్తులను మరో శాఖకు బదిలీ చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రతి దరఖాస్తు పై విచారించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. శాఖల వారీగా దరఖాస్తుల పెండింగ్ అంశాన్ని సమీక్షిస్తానని తెలిపారు. దరఖాస్తులను తమ వద్ద పెండింగ్లో ఉంచవద్దని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి సోమవారం 352 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణిలో వృద్ధులు, దివ్యాంగులు కూర్చున్న చోటకే వెళ్లి జిల్లా కలెక్టర్ వారి నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, లక్ష్మి కిరణ్, ఆర్డిఓ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతిలో వన్నియకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం

**వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేసిన సభ్యులు**



తిరుపతి సిటీ తిరుపతిలోని తాజ్ హోటల్ సమీపంలో ఆదివారం వన్నియకుల క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ పరిచయ వేదికను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమం కు వన్నియకుల క్షత్రియ నాయకులు మరియు వధూవరుల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సి.ఆర్. రాజన్, వన్నియకుల క్షత్రియ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ పరిచయ వేదిక కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మాట్లాడుతూ వన్నియకుల క్షత్రియలు రానున్న రోజుల్లో ఐక్యంగా సంఘటితం కావాల్సిన అవసరం మరియు వన్నియకుల క్షత్రియులను ఏకతాటిపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆత్మీయ సమ్మేళనం మరియు వధూవరుల వివాహ పరిచయ వేదికను ఘనంగా నిర్వహించబడింది అని తెలిపారు. వన్నియకుల క్షత్రియులను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం అయ్యంగారు మాట్లాడుతూ వన్నియకుల క్షత్రియుల్లో వెనుకబడిన వారికి ఆర్థిక సహాయం అందించడం, స్కాలర్షిప్ కార్యక్రమాలు నిర్వహించడం, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టడం, స్వంత వ్యాపారాలు ప్రారంభించాలి అనుకునే వారికి ఆర్థిక సహాయం అందించడం మరియు సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్స్ మునిరత్నం రెడ్డి, చిన్నారెడ్డి, తేజోవతి, వేణుగోపాల్, వామనమూర్తి, వన్నియకుల పెద్దలు, వన్నియకుల క్షత్రియ సోదరులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేసారు.

# ఇద్దరు దొంగల అరెస్టు



ఏలూరు తాళాలు వేసిన ఇండ్లను టార్గెట్ చేస్తూ గృహ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు సభ్యుల ముఠాను ముదినేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి 45 లక్షల విలువైన వెండి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కలిదిండి మండలం కు చెందిన గొల్ల వంశీ, కాలదేవి ప్రసాద్ లను రిమాండ్కు తరలిస్తున్నట్లు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ విలేకరుల సోమవారం సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ నక్క సూర్యచంద్రరావు ఏఆర్ అదనపల్లి ఎస్పీ ముని రాజా ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ సిఐలు ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# టీనీ ఇండియా టి20 వరల్డ్ కప్ విజయంపై డిసిసిబి చైర్మన్ ఎం సూర్యనారాయణ రెడ్డి అభినందనలు..

బద్వేలు. కోట్లాదిమంది భారతీయుల కలలను నిజం చేయడమే కాకుండా 2026 టి20 ప్రపంచ వరల్డ్ కప్ లో భారత జట్టు చాలా అద్భుతమైన విజయాన్ని సాధించి మూడోసారి ఛాంపియన్గా నిలిచిన సందర్భంగా సోమవారం డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి టీ20 టీం ఇండియాకు" ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు...అంతేకాకుండా 2007-2024 ప్రపంచ కప్పులను సైతం సొంతం చేసుకున్నాం భారత్ ఇప్పుడు తన ఖాతాలో 2026 టి20 ప్రపంచ కప్పును విజయం చేసుకుందన్నారు....టి20 మ్యాచ్ పూర్తికాగానే ప్రపంచ వేదికపై టీం ఇండియా సత్తా ఏమిటో వాళ్లకి చూపించి భారత్ విజయ పథకాన్ని ఎగరవేసిందని కొనియాడారు...ఈ క్రమంలో టి20 ఈ విజయం భారతదేశ యువతకు క్రీడలపై భవిష్యత్తులో ఎంతో ఉత్సాహాన్ని పెంపొదించేటట్టు కలిగిస్తుందని చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి ఈ సందర్భంగా పేర్కొన్నారు

# నెయ్యి ట్యాంకర్ బోల్తా

**స్థానికులు బిందెలు, బకెట్లతో ఎగబడ్డ వైనం ..**



కడపజిల్లా. కడప జిల్లా కొండాపురం మండలం చిత్రావతి వంతెన సమీపంలో ట్యాంకర్ బోల్తా పడింది..

దీంతో ట్యాంకర్లోని నెయ్యి నేలపాలైంది. విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని బిందెలు, బకెట్లు, బాటిళ్లతో నెయ్యి కోసం ఎగబడ్డారు

# కరుగట్టిన రేషన్ మాఫియా డాన్ కాజా సత్యనారాయణపై పిడి యాక్టు

విజయవాడ ఎన్.టి.ఆర్.జిల్లా లో రేషన్ బియ్యాన్ని అక్రమ మళ్లింపు, రవాణా మరియు స్మగ్లింగ్ వంటి నేరాలకు పదే పదే పాల్పడుతున్న కాజా సత్యనారాయణపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. నిందితుడు వీరులపాడు మండలం, జయంతి గ్రామానికి చెందిన కాజా సత్యనారాయణ నందిగామా, మైలవరం సబ్ డివిజన్ పరిధిలోని లబ్ధిదారుల నుంచి, కొంతమంది డీలర్స్ వద్ద నుండి రేషన్ బియ్యాన్ని తీసుకుని వాటిని అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తుంటాడు. ఇతను ఎక్కువగా వీరులపాడు మరియు కంచిక చెర్ల గ్రామాలలో నిర్వహిస్తుంటాడు. ఇతను ఈ గ్రామాలలో కొంతమందిని ఏజెంట్స్ గా ఏర్పాటు చేసుకోవడం మరియు షాప్ ల వారితో సంబందాలు ఏర్పాటు చేసుకుని ఈ అక్రమ వ్యవహారాలను నిర్వహిస్తుంటాడని పోలీసులు వెల్లడించారు.

## వెన్నెలను మైమరిపించే విద్యుత్ కాంతుల్లో ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి ఒంటిమిట్టలోని పవిత్రక్షేత్రమైన శ్రీ కోదండరామస్వామి ఆలయం బ్రహ్మోత్సవాలు ఈ నెల మార్చి 26వ తేదీ నుండి వైభవంగా ప్రారంభంకానున్న నేపథ్యంలో, భక్తుల హృదయాలను పరవశింపజేసేలా విద్యుత్ అలంకరణలను టిటిడి అత్యంత వైభవంగా చేపట్టింది. వెన్నెలకన్నా వెలుగొందే దీప కాంతులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక ఆనందాన్ని ప్రసరింపజేయనున్నాయి.ఒంటిమిట్ట ఆలయం పరిసరాలు, టిటిడి భవనం, వాహన మండపం, ప్రధాన కూడళ్లు, అలాగే ఒంటిమిట్ట నుండి మాధవవరం వరకు ఏర్పాటు చేస్తున్న అద్భుత విద్యుత్ అలంకరణలు భక్తులను మంత్ర ముగ్ధులను చేయనున్నాయి. పండుగ వాతావరణాన్ని మరింత మధురంగా మార్చుతూ బ్రహ్మోత్సవాల వైభవాన్ని కొత్త ఎత్తులకు చేర్చేలా ఈ ఏర్పాట్లు సాగుతున్నాయి.ఆలయం లోపల మరియు వెలుపల ప్రాంతాలు, నాలుగు మాడ వీధులు, పుష్కరిణి, కార్ పార్కింగ్ ప్రాంతం, ఒంటిమిట్ట పరిసర ప్రాంతాలు, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలు రాత్రివేళల్లో రజత కాంతులతో మెరిసిపోతూ బ్రహ్మోత్సవాలకు అపూర్వమైన శోభను చేకూర్చనున్నాయి.బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్న, మధ్య, పెద్ద పరిమాణాల్లో సుమారు 60కు పైగా అద్భుత ఇల్యూమినేషన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో శ్రీరామ పట్టాభిషేకం, శ్రీరామ కల్యాణం, అయోధ్య రాముడు, ఏనుగు మీద శ్రీవారు, గరుత్మంతుడిపై శ్రీవారు, శ్రీ పద్మనాభ స్వామి, అమ్మవారి త్రీడీ రూపం, దశావతారాలు, అష్టలక్ష్ములు వంటి దివ్యరూపాలు విద్యుత్ కాంతుల్లో ప్రతిఫలిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక శోభను పంచనున్నాయి.అదేవిధంగా 20 వేల సీరియల్ సెట్స్, 10 వేల ఫ్లడ్ లైట్లు, 350 రంగురంగుల లైట్లు, 40 జనరేటర్లు, తోరణాలు, నైన్ వాట్స్ తోరణాలతో ఒంటిమిట్ట అంతా ప్రకాశవంతంగా మారి భక్తులకు కనువిందు చేయనుంది.

## బాల కార్మికుల నివారణకు చర్యలు ఏంటి

### – లోక్‌సభలో ఎంపీ గురుమూర్తి ప్రశ్న

దేశంలో బాల కార్మికుల నివారణ, అసంఘటిత రంగం, కుటుంబ ఆధారిత చిన్నతరహా పరిశ్రమల్లో పిల్లలను ఉపయోగిస్తున్న అంశాలపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి లోక్‌సభలో ప్రశ్నించారు. ఈ ప్రశ్నకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ సహాయ మంత్రి శోభా కర్లందాజే సమాధానం ఇచ్చారు. బాల కార్మికుల వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం బాల కార్మికుల నిషేధం, నియంత్రణ చట్టం 1986 ను అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ చట్టం ప్రకారం 14 సంవత్సరాల లోపు పిల్లలను ఏ విధమైన పనుల్లోనూ నియమించడం పూర్తిగా నిషేధించబడిందని పేర్కొన్నారు. అలాగే 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న బాల, బాలికలను ప్రమాదకరమైన పనుల్లో పనిచేయించడం కూడా చట్టం నిషేధించిందని వివరించారు.అయితే పిల్లలు పాఠశాల సమయం తరువాత లేదా సెలవుల సమయంలో మాత్రమే ప్రమాదకరం కాని కుటుంబ ఆధారిత పనుల్లో సహాయం చేయడానికి అనుమతి ఉందని మంత్రి పేర్కొన్నారు. 2016లో ఈ చట్టంలో మార్పులు చేసి “పిల్లలు” అనే పదానికి నిర్వచనాన్ని ఉచిత మరియు నిర్బంధ విద్యా హక్కు చట్టం 2009లో పేర్కొన్న విదంగా తప్పనిసరి విద్యా వయస్సుకు అనుగుణంగా మార్చినట్లు తెలిపారు.చట్టం అమలును మరింత బలోపేతం చేయడానికి జిల్లా స్థాయిలో జిల్లా సమన్వయ అధికారి, ప్రత్యేక కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. బాల కార్మికుల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వాటిపై చర్యలు తీసుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక ఆన్‌లైన్ వేదికను కూడా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ వేదిక ద్వారా బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులను నమోదు చేసి, వాటి పరిష్కారాన్ని పర్యవేక్షించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు.

## శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి నెయ్యి నిల్వలకు కొరత లేదు

### అసత్య ప్రచారాలను నమ్మవద్దు

### – భక్తులకు టిటిడి విజ్ఞప్తి

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి నిల్వలు టిటిడి వద్ద సమృద్ధిగా ఉన్నాయని టిటిడి స్పష్టం చేసింది. ఇటీవల కొందరు వ్యక్తులు సామాజిక మాధ్యమాల్లో టిటిడి వద్ద నెయ్యి నిల్వలు లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని అసత్య ప్రచారం చేయడం సరికాదని తెలియజేస్తున్నాం .శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన ఆవు నెయ్యి సరఫరా మూడంచెల కొనుగోలు విధానం ద్వారా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతున్నందున ఎలాంటి అనుకోని పరిస్థితులు తలెత్తినా సరఫరాలో అంతరాయం కలగకుండా టిటిడి ముందస్తు చర్యలు తీసుకుంటోంది.ఈ క్రమంలో ఇందాపూర్ డైరీ నుండి తిరుమలకు వస్తున్న నెయ్యి ట్యాంకర్ ఇటీవల కడప జిల్లా కొండాపూర్ సమీపంలో ప్రమాదానికి గురైన విషయం నిజమే. అయితే ఒక సంస్థకు చెందిన ట్యాంకర్ ప్రమాదానికి గురైనంత మాత్రాన నెయ్యి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగలేదని టిటిడి స్పష్టం చేసింది. మిగిలిన రెండు సంస్థల నుండి నెయ్యి సరఫరా యథావిధిగా కొనసాగుతోంది.ప్రస్తుతం భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపింది. అందువల్ల లడ్డూ ప్రసాదాల తయారీ మరియు పంపిణీ ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతోందని వెల్లడించింది.అదేవిధంగా వేసవి కాలంలో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు టిటిడి పేర్కొంది. లడ్డూ తయారీకి సంబంధించిన పోటు విభాగంలో యంత్రాల నిర్వహణ, కన్వేయర్ బెల్ట్‌లు వంటి పరికరాల మరమ్మత్తులు సంబంధిత సంస్థల ద్వారా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు తెలిపింది.వాస్తవాలు ఇలా ఉండగా టిటిడి వద్ద నెయ్యి నిల్వలు లేవని, శ్రీవారి కైంకర్యాలకు మరియు లడ్డూ ప్రసాదాల తయారీకి ఆటంకం కలుగుతోందని అసత్య ప్రచారం చేయడం బాధాకరం. ఇటువంటి తప్పుదోవ పట్టించే ప్రచారాలు భక్తుల మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉన్నందున ప్రజలు, భక్తులు వాటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తోంది.శ్రీవారి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా లడ్డూ ప్రసాదాల తయారీ మరియు పంపిణీ పూర్తిస్థాయిలో కొనసాగుతోందని టిటిడి మరోసారి స్పష్టం చేసింది.

## వృద్ధుడికి గుండెపోటు కారు ప్రమాదం

సికింద్రాబాద్ సంగీత్ కూడలి వద్ద కారు బీభత్సం సృష్టించింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి సంగీత్ వైపుకు వెళుతున్న క్రమంలో ఇస్కాన్ దేవాలయం వద్ద కారులో ఉన్న వృద్ధుడికి ఆకస్మాత్తుగా గుండెపోటు రావడంతో ప్రమాదం చోటుచేసుకుంది.కారు నడుపుతున్న వృద్ధుడు వేగంగా వెళ్లి డివైడర్ను ఢీకొట్టడంతో కారు డివైడర్ పైకి దూసుకెళ్లి ఆగిపోయింది. ఈ ఘటనలో గోపాలపురం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రవికుమార్ అతని సిబ్బంది కారు డోర్లను తెరిచి అందులో ఉన్న వృద్ధుడికి సిపిఆర్ నిర్వహించారు. వెంటనే అంబులెన్స్ కు సమాచారం అందించి సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించారు. కారు వేగంగా డివైడర్ను ఢీకొట్టడంతో ముందున్న వాహనదారులకు ప్రాణాపాయం తప్పింది.

## విద్యుత్ షాక్ తో ఇద్దరు మృతి

మంచిర్యాల మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మేదరిపేటలో సోమవారం ఉదయం జరిగిన ఘోర విద్యుత్ ప్రమాదంలో ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు.మేదరిపేట పెట్రోల్ బంకులో నుండి ఎత్తయినా ఇనుప నిచ్చెనను బంకు యజమాని ఇంటికి తరలించే క్రమంలో సమీపంలోని 11కేవి విద్యుత్ తీగలకు నిచ్చెన తగలడంతో మండలంలోని మాదాపూర్ కు చెందిన లక్ష్మీనారాయణ (45), వెల్గనూరుకు చెందిన నాగరాజు (35) అనే ఇద్దరూ మృతి చెందారు.విద్యుత్ షాక్ తీవ్రతకు నాగరాజు శరీరం పూర్తిగా కాలిపోగా, ఈ ప్రమాదం నుండి గంగాధర్ అనే యువకుడు తృటిలో తప్పించుకున్నాడు.
ప్రమాద సమాచారం అందుకున్న దండేపల్లి ఎస్సై తహసీనొద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేయగా పెద్ద మనుషుల సమక్షంలో చర్చలు కొనసాగాయి.

## ఖమ్మంలో తీవ్ర ఉద్రిక్తత

ఖమ్మం సోమవారం నాడు ఖమ్మం నగరంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భూదాన్ భూముల్లో ఇళ్లు కోల్పోయిన బాధితులకు అక్కడే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని తెలంగాణ జాగృతి నేత కల్వకుంట్ల కవిత బాధితులతో కలిసి అంబేద్కర్ విగ్రహం ఎదుట బైఠాయించారు. రెండు గంటలకు పైగా రోడ్డుపై ధర్నా చేయడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. జిల్లా కలెక్టర్ వచ్చి హామి ఇచ్చే వరకు కదిలేది లేదని బాధితులు అన్నారు. పోలీసులు అరెస్ట్ లు చేస్తుండగా ఇరువర్గాల మధ్య తీవ్రతోపులాట జరిగింది. ఘటనలో ఒక మహిళ పోలీసుల సృహ కోల్పోయింది.

# అపోలో నాలెడ్జ్ సిటీలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం





చిత్తూరు అపోలో నాలెడ్జ్ సిటీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళల శక్తి, ధైర్యం, సమాజ అభివృద్ధిలో వారి పాత్రను గుర్తు చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (చూడా) చైర్‌పర్సన్ కటారి హేమలత, అపోలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సతీమణి, మాజీ ఓబీజీ ప్రొఫెసర్ డాక్టర్ పార్వతి భట్ హాజరయ్యారు. వారు దీప ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చూడా చైర్‌పర్సన్ కటారి హేమలత మాట్లాడుతూ మహిళలు ఎదురయ్యే సవాళ్లను అవకాశాలుగా మార్చుకుని ముందుకు సాగాలని అన్నారు. నర్సులు సమాజానికి విశేష సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. తల్లి విద్యావంతురాలైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మహిళా విద్య కోసం కృషి చేసిన సావిత్రిబాయి పూలే, అంతరిక్షంలో అడుగుపెట్టిన కల్పనా చావ్లా, స్వాతంత్ర్య సమరయోధురాలు దుర్గాబాయి దేశ్‌ముఖ్, క్రీడాకారిణి పి.వి.సింధు వంటి మహిళల విజయాలను ఉదాహరణగా వివరించారు. డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి స్ఫూర్తితో వారి కుమార్తెలు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెవెళు_న్నారని కొనియాడారు. మాజీ ఓబీజీ ప్రొఫెసర్ డాక్టర్ పార్వతి భట్ మాట్లాడుతూ తాను గత 40 సంవత్సరాలుగా మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొంటున్నానని, ఈ కాలంలో మహిళల పరిస్థితుల్లో వచ్చిన మార్పును సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సాధికారత కొంతమందికే పరిమితం కాకుండా ప్రతి మహిళకు చేరాలని చెప్పారు. కుటుంబం నుంచే మహిళా సాధికారత ప్రారంభమవాలని పేర్కొన్నారు. ఇంటి పనులు మహిళలకే పరిమితం అన్న భావజాలం మారాలని, పురుషులు కూడా సమానంగా బాధ్యతలు పంచుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ది అపోలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. పోతరాజు, ఏఐఎంఎస్ఆర్ డీన్ డాక్టర్(బ్రిగేడ్) జె. అగస్టిన్, అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య రామకృష్ణన్, నర్సింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టి. జయంతి, ఎడబ్ల్యూఈసి కన్వీనర్ డాక్టర్ ఎస్. హసీనా, కో-కన్వీనర్ డాక్టర్ శాని ఎస్.ఎస్., ఐసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ జి.బి. హిమబిందు, ఏఐఎంఎస్ఆర్ స్టూడెంట్స్ అఫైర్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ దీప్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఏ. గాయత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా క్యాంపస్‌లో మహిళల గౌరవాన్ని పెంపొందించేందుకు డిగ్నిటీ ఛాంపియన్స్, క్యాంపస్ అంబాసిడర్లను ప్రకటించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యూజిక్ బ్యాండ్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## అంగన్వాడీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది:

### గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



గుడివాడ రాష్ట్రంలో అంగన్వాడీ సోదరీమణుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ పట్టణం ఏలూరు రోడ్డులోని ప్రజా వేదిక కార్యాలయంలో అంగన్వాడి కార్యకర్తలతో ఎమ్మెల్యే రాము ముఖాముఖిగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తమ సమస్యలను అంగన్వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకురాగా.... వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన భరోసా ఇచ్చారు.ఆర్థిక ఇబ్బందులతోనే వేతనాల పెంపు కొంత ఆలస్యం అయ్యిందని... ఈ సమస్య కూడా త్వరలోనే పరిష్కారం అవుతుందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపినట్లు ఎమ్మెల్యే రాము సమావేశంలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలకు చెప్పారు. పెద్ద మనసుతో తమ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటున్న ఎమ్మెల్యే రాముకు సమావేశంలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ఏపీలో అంగన్వాడీ వ్యవస్థ బలోపేతానికి సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అంగన్వాడి సోదరీమణులకు ఇచ్చిన ఎన్నికల హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం కారణంగానే , అంగన్వాడీల జీతాల పెంపు సమస్య పరిష్కారం కొంత ఆలస్యం అవుతుందన్నారు. సీఎం చంద్రబాబు పాలనలోనే గతంలో అంగన్వాడీల జీతాలు పెరిగాయని, మరే ప్రభుత్వం వారి జీతాలు పెంచలేదని ఎమ్మెల్యే రాము గుర్తు చేశారు.అంగన్వాడి సోదరీమణుల కష్టం గుర్తించిన ఏకైక ప్రభుత్వం సీఎం చంద్రబాబు ప్రభుత్వం మాత్రమే అని ఎమ్మెల్యే రాము ఉద్ఘాటించారు.

## వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితులకు ఇళ్ళ స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ళు

హైదరాబాద్ ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితుల విషయం పై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సోమవారం సీఎం రేవంత్ రెడ్డితో భేటీ అయ్యారు. వెలుగుమట్ల భూదాన్ నిర్వాసితులకు ఇళ్ళ స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేయాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేసారు. దానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల పై నిర్వాసితులు హర్షం తెలియచేసారు.

## రాజంపేటలో లేడీస్ హాస్టల్ యజమానిపై దాడి

రాజంపేట రాజంపేట మండలం బోయినపల్లిలోని 'ప్రియా లేడీస్ హాస్టల్' యజమానిపై కొందరు వ్యక్తులు మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయనకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తిరుపతి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దాడికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 40 వినతులు.

### కమిషనర్ ఎన్. మౌర్య.



తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 వినతులు వచ్చాయని కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 28 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 12 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. కాగా తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ ఎస్.కె.బాబు, ఆంజనేయిలు కమిషనర్ ను కోరారు. స్థానిక నాల్గవ వార్డులో ఉన్న సమస్యలు పరిష్కరించాలని, బలిజ వీధిలో ప్రమాధకరంగా ఉన్న చెట్టును తొలగించాలని, సింగాల గుంటలోని అమ్మవారి ఆలయం వద్ద గుంతలు పూడ్చాలని, మరుగుదొడ్ల నీరు రోడ్డు పైకి రాకుండా చూడాలని, సుందరయ్య నగర్ నందు యూడీస్ సరిగా లేనందున త్రాగునీరు కలుషితం అవుతోంది పరిష్కరించాలని, బీమాస్ హోటల్ వద్ద చెత్త కుప్పల వలన మురుగునీరు రోడ్లపైకి వస్తోంది పరిష్కరించాలని, అనంత వీధిలో అనుమతులు లేని నిర్మాణాలు ఆపాలని, యమహా షోరూం వద్ద చెత్త కుప్పలు తొలగించాలని, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని, శ్రీనివాసం వద్ద తొలగించిన తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకునేందుకు స్థలం చూపాలని, పెద్ద కాపు లేఔట్ కు వెళ్లేలా గరుడ వారధి వద్ద మార్గం ఏర్పాటు చేయాలని, మునిసిపల్ పార్కు వెనుక భాగంలో ఆక్రమణలు తొలగించాలని, పెళ్లి కోసం వేసిన పందిరి వ్యర్థాలు తొలగించాలని, చేపల మార్కెట్ వద్ద యూడీస్ మరమ్మతులు చేయాలని కోరారు.ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీరు శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

# భోజనం చేసిన తరువాత స్నానం చేస్తే కలేగే అనర్ధాలు

హైదరాబాద్ ;తిన్న తరువాత స్నానం చేయకూడదు అని పెద్దలు చెబుతూ ఉంటారు. కానీ చాలా మంది పెద్దగా ఆలోచించకుండా తిన్న తరువాత వెంటనే స్నానం చేస్తూ ఉంటారు. ఇది సాధారణంగా అనిపించినా, కొన్ని సందర్భాల్లో వెంటనే స్నానం చేయడం శరీరానికి అంత మంచిది కాకపోవచ్చు. జీర్ణక్రియ అనేది వెంటనే జరిగిపోయే ప్రక్రియ కాదు. ఆహారం జీర్ణం అవ్వడానికి కొంత సమయంతో పాటు కొంత శక్తి కూడా అవసరం. భోజనం చేసిన తరువాత స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రతలో మార్పులు వస్తాయి. దీంతో జీర్ణక్రియకు కొంత అంతరాయం కలిగే అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

ఈ సమస్యలు వచ్చే అవకాశం..

భోజనం చేసిన తరువాత శరీరం జీర్ణక్రియ మోడ్ లోకి వెళ్లిపోతుంది. ఆ సమయంలో రక్తం ఎక్కువగా పొట్టకు సరఫరా అవుతుంది. జీర్ణక్రియ ఎంజైమ్ లు పని చేయడం మొదలుఅవుతాయి. శరీరం మొత్తం ఆహారాన్ని జీర్ణం చేయడానికి ప్రయత్నిస్తుంది. భోజనం చేసిన తరువాత శరీరం దృష్టి అంతా ఆహారం జీర్ణం చేయడంపైనే ఉంటుంది. ఈ సమయంలో వేడి లేదా చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల శరీరం తన దృష్టిని శరీర ఉష్ణోగ్రత నియంత్రణ వైపు మళ్లిస్తుంది. శరీరం ఉష్ణోగ్రతను నిర్వహించడానికి రక్తప్రసరణను సర్దుబాటు చేస్తుంది. దీని వల్ల జీర్ణక్రియ కొంత సేపు అలస్యం అవుతుంది. ఫలితంగా కడుపు ఉబ్బరం, గ్యాస్, పొట్ట బరువుగా అనిపించడం వంటి సమస్యలు తలెత్తుతాయని నిపుణులు తెలియజేస్తున్నారు. కనీస వ్యవధి ఉండాలి..

కనుక భోజనం చేసిన వెంటనే స్నానం చేయకూడదని భోజనం చేసిన 30 నుండి 45 నిమిషాల తరువాత స్నానం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. జీర్ణక్రియ పూర్తిగా మొదలైన తరువాత స్నానం చేయడం మంచిదని నిపుణులు తెలియజేస్తున్నారు. కొన్ని సార్లు సాధారణంగా తీసుకునే విషయాలు కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తాయని, భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం అంత మంచిది కాదని నిపుణులు పేర్కొంటున్నారు.

# తిరుపతిని అభివృద్ధి ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం

## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



తిరుపతి తిరుపతిని అన్ని విధాల అభివృద్ధి పరచడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. నగరంలోని రోడ్లు, డ్రైనేజీ కాలువల మరమ్మత్తులు వెంటనే పూర్తి చేసేందుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన చెప్పారు. నగరంలోని మూడు డివిజన్ లలో సిసి రోడ్లు, డ్రేనేజీ కాలువల పైపులు నిర్మాణ ప్రారంభ, శంఖుస్థాపనలు సోమవారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చేశారు. డిప్యూటి మేయర్ ఆర్సీ మునికృష్ణా ప్రాతినిధ్యం వహిస్తున్న 35వ డివిజన్ లో 24.35 లక్షలతో రైల్వే కాలనీలో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అలాగే సుందరయ్య నగర్ లో 19.65 లక్షలతో నిర్మించిన యూజిడి లైన్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. నగరంలో మట్టి రోడ్డు అన్న మాటకు తావులేకుండా సీసీ రోడ్స్ వేస్తామని ఆయన తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువల నిర్మాణం ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని ఆయన చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు తిరుపతి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఆయన చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం ఎన్డీఏ కూటమి ప్రభుత్వ విధానమని టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షురాలు పనబాక లక్ష్మి అన్నారు. పుణ్యక్షేత్రమైన తిరుపతిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రభుత్వం అన్ని విధాలా అభివృద్ధిపరుస్తుందని ఆమె తెలిపారు. కాగా కార్పొరేటర్ దూది కుమారి ప్రాతినిధ్యం 33వ డివిజన్ పరిధిలోని అశోక్ నగర్ లో 29.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. అలాగే కార్పొరేటర్ ఎస్ కే బాబు ప్రాతినిధ్యం వహిస్తున్న 12వ డివిజన్ పరిధిలో 46.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రారంభించారు. కెన్నెడీ నగర్ లో 30లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. అలాగే మూడవ డివిజన్ లోని లక్ష్మీపురం 20 80 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్లు నరసింహచారి, పొన్నాల చంద్ర , నరేంద్ర, కుడితి సుబ్రమణ్యం, క్రికెట్ విజయ్ , కోడూరు బాలసుబ్రమణ్యం , ఆర్సీ శ్రీనివాస్, ఊట్ల సురేంద్ర నాయుడు, రాజా రెడ్డి, శంకర్ యాదవ్,రాజేష్ ఆచ్చారి, శ్రీలక్ష్మి, బాలాజీ, బ్యాంకు శాంతమ్మ, ఆదం సుధాకర్ రెడ్డి, యాదవ కృష్ణా, కంబాల గోవిందు, దొరై రాజ్, దొడ్డారెడ్డి రామకృష్ణా రెడ్డి, వినోద్ రాయల్, వంశీ, పోటుకూరు ఆనంద్, వుసా మాధవ రావు, ఆముదాల వెంకటేష్, సుభాషిణి, మధు, రమేష్ రెడ్డి, నాగరాజు, నీలిమ, ఎస్ ఈ శ్యాంసుందర్, ఈఈ తులసి కుమార్, గోమతి తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ వ్యవస్థకు మూలస్తంభం మహిళ

## – టీటీడీ జేఈవో (విద్య, వైద్యం) డా. ఎ. శరత్

తిరుపతి 32 మంది మహిళా ఉద్యోగులకు పద్మావతి అవార్డులుమహతి కళాక్షేత్రంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలుభారతీయ కుటుంబ వ్యవస్థకు మహిళ మూలస్తంభమని, పండితులకు వేదం ఎంత పవిత్రమో గృహాలకు గృహలక్ష్మి అంతే పవిత్రమని టీటీడీ జేఈవో (విద్య, వైద్యం) డా. ఎ. శరత్ పేర్కొన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో సోమవారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ కుటుంబ నిర్మాణం, సమాజ అభివృద్ధి, దేశ ప్రగతిలో మహిళల పాత్ర అత్యంత కీలకమన్నారు. ప్రతి మనిషికి తల్లి మొదటి గురువని, పిల్లలకు ధర్మం, సంస్కారం, విలువలు నేర్పేది తల్లేనని తెలిపారు. తల్లి సద్గుణవంతురాలైతే కుటుంబం సుస్థిరంగా ఉంటుందని, కుటుంబం బాగుంటే సమాజం శాంతియుతంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సమాజం అభివృద్ధి చెందితే రాష్ట్రం, దేశం కూడా ప్రగతి మార్గంలో ముందుకు సాగుతాయని అన్నారు. మహిళలు కుటుంబానికి మాత్రమే కాకుండా సమాజానికి కూడా మార్గదర్శకులుగా నిలుస్తారని వివరించారు.టీటీడీ బోర్డు సభ్యురాలు శ్రీమతి పనబాక లక్ష్మి మాట్లాడుతూ, సనాతన ధర్మంలో మహిళకు అత్యున్నత స్థానం కల్పించబడిందన్నారు. స్త్రీని దేవతగా పూజించే సంప్రదాయం భారతదేశానికి ప్రత్యేకమని తెలిపారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని చెప్పారు. నేటి కాలంలో మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ సమాజ పురోగతికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు.న్యూఢిల్లీకి చెందిన మిత్రావక్ మరియు డిజిటల్ మహిళ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో శ్రీమతి ఆశ్లేష మాట్లాడుతూ, మహిళల్లో అపారమైన శక్తి, చైతన్యం నిక్షిప్తమై ఉందన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ఉన్న గౌరవస్థానం ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. ఎక్కడ స్త్రీలను గౌరవిస్తారో అక్కడ సుఖశాంతులు, ఐశ్వర్యం వర్ధిల్లుతాయని పేర్కొన్నారు.డిఆర్‌డిఓ శాస్త్రవేత్త డా. చంద్రిక కౌశిక్ మాట్లాడుతూ, సమాజంలో సానుకూల మార్పు రావాలంటే మహిళలు ముందుగా తమను తాము ప్రాధాన్యంగా భావించాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సభ్యులు బాధ్యతలను పంచుకుంటే మహిళలపై ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఇంటి పనులు, పిల్లల సంరక్షణ వంటి బాధ్యతలను కుటుంబ సభ్యులు కలిసి పంచుకోవడం ద్వారా సమతుల్య జీవనం సాధ్యమవుతుందని సూచించారు.

# లెబనాన్‌పై దాడుల్లో భాగంగా ప్రజల నివాసాలపై వైట్ ఫాస్ఫరస్ ప్రయోగం

## ఇండ్లపై వైట్ ఫాస్ఫరస్ చల్లినట్లు గుర్తించిన అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం

న్యూ డిల్లీ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఒక పక్క ఇరాన్‌పై యుద్ధం చేస్తున్న ఇజ్రాయెల్ మరోవైపు లెబనాన్‌పై కూడా దాడులకు దిగింది. ఈ రెండు దేశాల మధ్య కూడా దశాబ్దాలుగా వైరం నడుస్తోంది. వారం రోజుల నుంచి ఇరాన్.. లెబనాన్‌పై దాడులకు పాల్పడుతోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 400 మందికిపైగా లెబనాన్ ప్రజలు మరణించినట్లు ఆ దేశం ప్రకటించింది. లెబనాన్ రాజధాని బీరుట్‌పై కూడా దాడి చేసింది. ప్రజల నివాసాలపై కూడా మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ క్రమంలో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు.ఇదే సమయంలో ఇప్పుడు ఇజ్రాయెల్ చేసిన ఒక పని వివాదానికి కారణమైంది. లెబనాన్‌పై దాడుల్లో భాగంగా ప్రజల నివాసాలపై వైట్ ఫాస్ఫరస్ ప్రయోగించినట్లు తేలింది. ఈ నెల 3న లెబనీస్ పట్టణమైన యోమోర్‌పై జరిపిన దాడిలో ఇండ్లపై వైట్ ఫాస్ఫరస్ చల్లినట్లు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం గుర్తించింది. ద

దీనికి సంబంధించిన ఆధారాల్ని కూడా సేకరించింది. దీని ద్వారా రెండు ఇండ్లు, ఒక కారు మంటల్లో చిక్కుకున్నాయి. అక్కడి ఫైర్ అధికారులు స్పందించి మంటలు ఆర్పేశారు. ఈ వైట్ ఫాస్ఫరస్ చల్లిన తర్వాత చిన్న నిప్పురవ్వ అంటుకున్నా మొత్తం మంటలు వ్యాపిస్తాయి. ఇలాంటి చర్యలకు అనుమతి ఉండదు. అంతర్జాతీయ చట్టాలకు వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా ఇజ్రాయెల్ ఇలాంటి పని చేస్తుందని, దీనివల్ల తమ పౌరుల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉంటుందని లెబనాన్ అధికారులు అన్నారు.వీటి ద్వారా ఎవరైనా గాయాలపాలైనా వాటి ప్రభావం చాలాకాలం ఉంటుందని తెలిపారు. వైట్ ఫాస్ఫరస్‌ను బాంబులు, షెల్స్, రాకెట్లు వంటి వాటిలో వాడుతారు. ఈ కెమికల్ ఆక్సిజన్ రియాక్షన్‌కు గురైనా మంటలు అంటుకుంటాయి. అందుకే అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఈ కెమికల్‌ను వాడటం, పౌరులకు హాని చేయడం నేరం. మిలిటరీ కార్యక్రమాలకే దీన్ని వాడాలి.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 2,400 పాయింట్లు పతనం.. 12 లక్షల కోట్లు ఆవిరి

ముంబై ఇండియన్ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. గతవారం నష్టాల్లోనే ముగిసిన ట్రేడింగ్ సోమవారం ఉదయం కూడా నష్టాల్లోనే ప్రారంభమైంది. ఉదయం 9.28 గంటల సమయంలో సెన్సెక్స్ ఏకంగా 2,444.51 పాయింట్లు నష్టపోయి, 76,474.39 పాయింట్ల వద్ద కొనసాగింది. నిఫ్టీ కూడా 729.90 పాయింట్లు నష్టపోయి 23,720.55 పాయింట్ల వద్ద కొనసాగింది. దీంతో ట్రేడింగ్ ప్రారంభమైన పది నిమిషాల్లోనే దాదాపు రూ.12 లక్షల కోట్లకుపైగా ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది.అంతర్జాతీయ పరిణామాలు, గల్ఫ్ యుద్ధం, చమురు ధరలు పెరగడం వంటివి స్టాక్ మార్కెట్ల నష్టానికి కారణాలుగా నిపుణులు చెబుతున్నారు. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ కూడా భారీగా తగ్గింది. ప్రస్తుతం రూపాయి 92.25 వద్ద కొనసాగుతోంది. మార్కెట్ ప్రారంభా కాగానే ఇన్వెస్టర్లు ఎక్కువగా అమ్మకాలకు పాల్పడ్డారు. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభం కారణంగా ఇండియాలో చమురు ధరలు పెరిగే అవకాశం ఉంది. చమురు ధరల దెబ్బకి మార్కెట్ మరింత దిగజారే అవకాశం ఉందని ప్రముఖ ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడు డా.విజయ్ కుమార్ అన్నారు. చమురు ధరల ప్రభావం సామాన్యుడిపై పడితే ద్రవ్యోల్బణం కూడా భారీగా పెరుగుతుంది. ప్రస్తుతం బ్యారెల్ ముడి చమురు ధర 100 డాలర్లు దాటింది. మరోవైపు ఆసియన్ మార్కెట్లు కూపడా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి.అందులోనూ సౌత్ కొరియా కొస్పి వరుసగా 4 సెషన్లలో రెండోసారి సర్క్యూట్ బ్రేకర్‌ను తాకింది. దీంతో 8 శాతం సూచీ పడిపోయింది. ఫలితంగా 20 నిమిషాలపాటు ట్రేడింగ్ నిలిపివేశారు. జపాన్ నిక్కీ, అమెరికన్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం నిఫ్టీలో కోల్ ఇండియా స్టాక్ ఒక్కటే లాభాల్లో ట్రేడవుతోంది. టాటా స్టీల్, మారుతీ సుజుకి, ఎస్‌బీఐ, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. అయితే, అంతర్జాతీయ పరిణామాలు మార్కెట్లపై దీర్ఘకాలిక ప్రభావం చూపబోవని, అందువల్ల పెట్టుబడిదారులు ఓపికతో ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# వైసిపి హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నాం

## రికార్డులు తారుమారు చేయకుండా..పక్కాగా పాస్ పుస్తకాలు

## క్యూఆర్ కోడ్ తో పాస్ పుస్తకాలు : సిఎం చంద్రబాబు నాయుడు

అమరావతి కూటమి ప్రభుత్వం వచ్చాక.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చి అడ్డగోలుగా వ్యవహరించారని, వైసిపి హయాంలో భూములను చెరబట్టారని అన్నారు. నంద్యాల జిల్లాలో సిఎం పర్యటించారు. కొత్తబురుజులో పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పాస్ పుస్తకాలపై, సర్వే రాళ్లపై మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి ఫోటోలు ఏంటి? అని..ఇదేంటని అడిగితే.. బాధితులపైనే కేసులు పెట్టారని విమర్శించారు. వైసిపి హయాంలో జరిగిన తప్పులను సరిచేస్తున్నామని, రికార్డులు తారుమారు చేయకుండా..పక్కాగా పాస్ పుస్తకాలు, క్యూఆర్ కోడ్ తో పాస్ పుస్తకాలను ఇస్తున్నామని తెలియజేశారు. తప్పులను సరిచేసి.. మీ భూములను మీకు అప్పగిస్తామని, గత ఐదేళ్ల లో అన్నీ వివాదాలే, కుంభకోణాలేనని మండిపడ్డారు. తాను శ్రీవారి భక్తుడని..అలిపిరి ఘటనలో ఆ దేవుడే తనను కాపాడాడని ఆనందాన్ని వ్యక్తం చేశారు. గత పాలకులు తిరుమల పవిత్రతను దెబ్బతీసే ప్రయత్నం చేశారని, తిరుమల ప్రసాదాన్ని సైతం కల్తీ చేశారని, మద్యాన్ని కల్తీ చేసి.. వేలమంది ప్రాణాలు తీశారని ధ్వజమెత్తారు. మీ జీవితాలు, ఆరోగ్యంతో ఆడుకున్నారని, ఎన్ డిడిబి రిపోర్టులో ఉన్నదే ఆనాడు చెప్పానని చంద్రబాబు పేర్కొన్నారు.

# అత్మవిశ్వాసంతో మహిళలు సవాళ్లను ఎదుర్కోవాలి

శ్రీకాకుళం రాష్ట్రంలోని మహిళల సమగ్ర అభ్యున్నత సాధించాలన్నదే ప్రభుత్వ ఆశయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు.శ్రీకాకుళం టెక్కలి ఆదిత్య కళ్యాణ మండపంలో మహిళా మండలి సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, సమాజంలో మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించి గౌరవించడం మన అందరి బాధ్యత అని అన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అన్నారు. 1982 సంవత్సరంలో నందమూరి తారక రామారావు ముఖ్యమంత్రి అయిన తర్వాత సమాజంలో మహిళలకు పేరు, గుర్తింపు తెచ్చారన్నారు. రాష్ట్రంలో పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన హక్కుల కోసం ఎన్టీఆర్ కృషిచేశారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టి ఆలోచనతో భవిష్యత్తులో మహిళలు ఉన్నత స్థితిలో నిలపాలన నిర్ణయంతో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు రుణాల అందజేసి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా తోడ్పాటు అందిస్తున్నారన్నారు. నారీమణులు ఆత్మవిశ్వాసంతో సమాజంలోని సవాళ్ళ ను ఎదుర్కోవాలని సూచించారు.

# హనుమాన్ టేక్రీ ఆలయానికి ట్రోఫీ

టీ20 ప్రపంచకప్లో భారత జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. ఫైనల్లో న్యూజిలాండ్ను 96 పరుగుల భారీ తేడాతో ఓడించి వరుసగా రెండోసారి విశ్వవిజేతగా నిలిచింది. దీంతో టీ20 ప్రపంచకప్ చరిత్రలో టోర్నమెంట్కు ఆతిథ్యం ఇచ్చి టైటిల్ గెలిచిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. ఈ విజయం తర్వాత భారత జట్టు సభ్యులు తమ సంతోషాన్ని వినూత్నంగా పంచుకున్నారు.మ్యాచ్ ముగిసి, మీడియా సమావేశాలు పూర్తయిన కొన్ని గంటల్లోనే కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, ఐసీసీ ఛైర్మన్ జై షా.. గెలిచిన ప్రపంచకప్ ట్రోఫీని నేరుగా నరేంద్ర మోడీ స్టేడియం పక్కనే ఉన్న హనుమాన్ టేక్రీ ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ ఆంజనేయ స్వామి పాదాల చెంత ట్రోఫీని ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీస్సులు తీసుకున్నారు.

# ప్రైజ్ మనీ 27 కోట్లు

అహ్మదాబాద్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్లో విశ్వవిజేతగా నిలిచిన భారత జట్టుపై కాసుల వర్షం కురుస్తోంది. ఫైనల్లో న్యూజిలాండ్ను ఓడించి కప్ కైవసం చేసుకున్న సూర్యకుమార్ యాదవ్ సేన కేవలం ట్రోఫీనే కాకుండా ఐసీసీ చరిత్రలోనే రికార్డు స్థాయిలో నగదు బహుమతిని కూడా సొంతం చేసుకుంది. ఈ విజయంతో టీమిండియాకు సుమారు రూ. 27.30 కోట్లు ప్రైజ్ మనీగా లభించనున్నాయి.ఈసారి ఐసీసీ మొత్తం ప్రైజ్ పూల్ను 20 శాతం పెంచి 13.5 మిలియన్ డాలర్లకు చేర్చడంతో విజేతకు అందే నగదు కూడా భారీగా పెరిగింది.

గతేడాది రోహిత్ శర్మ సారథ్యంలో కప్ గెలిచిన జట్టుకు అందిన రూ. 22.30 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రూ. 5 కోట్లు అధికం. మరోవైపు, ఫైనల్లో ఓడి రన్నరప్గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు సుమారు రూ. 14.56 కోట్లు దక్కనున్నాయి.ఐసీసీ నుంచి అధికారికంగా అందే ఈ భారీ ప్రైజ్ మనీతో పాటు, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కూడా ఆటగాళ్లకు ప్రత్యేకంగా భారీ బోనస్ ప్రకటించే అవకాశం ఉంది. దీంతో ఈ చారిత్రక విజయం ఆటగాళ్లకు ఆర్థికంగా కూడా ఓ మెగా జాక్పాట్గా నిలవనుంది.

# ఒక విజయం.. మూడు రికార్డులు

ఒకే విజయంతో మూడు రికార్డులను సొంతం చేసుకుంది.టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టూ వరుసగా రెండుసార్లు కప్పు గెలవలేదు. 2024లో ఛాంపియన్గా నిలిచిన భారత్, ఇప్పుడు 2026లో కూడా టైటిల్ గెలిచి, టైటిల్ను డిఫెండ్ చేసుకున్న తొలి పురుషుల జట్టుగా రికార్డు సృష్టించింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలో ఉన్న ఓ పెద్ద సెంటిమెంట్ను భారత్ బద్దలు కొట్టింది. 2007లో టోర్నీ ప్రారంభమైనప్పటి నుంచి ఏ ఆతిథ్య దేశం కూడా సొంతగడ్డపై కప్పు గెలవలేదు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి జట్లు ఆతిథ్యం ఇచ్చినా కప్పును ముద్దాడలేకపోయాయి. ఈ విజయంతో టీ20 ఫార్మాట్లో అత్యధిక సార్లు వరల్డ్ కప్ గెలిచిన జట్టుగా భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2007లో ధోని సేన తొలి కప్పు గెలవగా, 2024లో రెండోసారి, ఇప్పుడు 2026లో మూడోసారి టైటిల్ సాధించింది వెస్టిండీస్, ఇంగ్లండ్ చెరో రెండుసార్లు గెలవగా, భారత్ మూడు టైటిళ్లతో అందరికంటే ముందుంది.

# భారీ అంచనాలతో ఉస్తాద్ ఊపు

పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే సినిమా విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్లో తన సత్తా చాటుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే సుమారు రూ. 41 లక్షలు) పైగా గ్రాస్ వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది.. పవన్ కల్యాణ్కు విదేశాల్లో ఉన్న బలమైన ఫ్యాన్ బేస్, అలాగే హరీశ్ శంకర్తో ఆయన కాంబినేషన్లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్బస్టర్ సినిమా ఉండటంతో ఈ క్రేజ్ ఏర్పడింది. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, నార్త్ అమెరికా మార్కెట్లో కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ జోరు చూస్తుంటే ప్రీమియర్లతోనే భారీ వసూళ్లు రాబట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్గా విడుదల కానుంది.

# రెండింతలయిన విమాన ప్రయాణ ధరలు

యుద్ధ వాతావరణం విమానయాన రంగంపై ప్రభావం పడింది. అమెరికా, భారత్ మధ్య నడిచే ప్రధాన రూట్లలో విమాన టికెట్ ధరలు భారీగా పెరిగాయి. అమెరికా, యూరప్, ఆసియా ఖండాలను అనుసంధానించే ప్రధాన కేంద్రంగా మిడిల్ ఈస్ట్ ఉంటుంది. ఘర్షణలతో ఈ ప్రాంతం మీదుగా వెళ్లేందుకు విమానయాన సంస్థలు వెనకాడుతున్నాయి. ఫ్లైట్ రాడార్ 24 డేటా ప్రకారం, ఒకప్పుడు విమానాలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు చాలా వరకు ఖాళీగా కనిపిస్తోంది. సురక్షితమైన ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళుతుండటంతో ప్రయాణ సమయం, ఖర్చు పెరిగి ఆ భారం ప్రయాణికులపై పడుతోంది.

గూగుల్ ఫ్లైట్స్ తాజా గణాంకాల ప్రకారం.. న్యూయార్క్, షికాగో, నెవార్క్ నగరాల నుంచి ముంబై, న్యూఢిల్లీకి వచ్చే విమాన టికెట్ల రేట్లు అమాంతం పెరిగాయి. ముఖ్యంగా న్యూయార్క్ జేఎఫ్ కే విమానాశ్రయం నుంచి న్యూఢిల్లీకి టికెట్ ధరలు ప్రస్తుతం రూ. 1.34 లక్షల నుంచి రూ. 2.25 లక్షల వరకు పలుకుతున్నాయి. సాధారణ రోజుల్లో ఇవి రూ. 45 వేల నుంచి రూ. 1 లక్ష మధ్య ఉంటాయి. అంటే 100 శాతానికి పైగా ధరలు పెరిగాయి. షికాగో నుంచి వచ్చే విమానాల్లో ఈ పెరుగుదల మరింత ఎక్కువగా ఉంది.

# మహిళల రక్షణగా సోషల్ మీడియా పై చర్యలు

సోషల్ మీడియా వేదికగా సాగుతున్న అసత్య ప్రచారాలు, వ్యక్తిత్వ హననంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. సోషల్ మీడియాలో అదుపులేకుండా సాగుతున్న అవాస్తవాల ప్రచారాన్ని అడ్డుకునేందుకు త్వరలోనే ప్రభుత్వం ఒక కొత్త కఠిన చట్టాన్ని తీసుకురాబోతుందని సంచలన ప్రకటన చేశారు.

ముఖ్యంగా మహిళలను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న వేధింపుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.సోషల్ మీడియాను కొందరు వ్యక్తులు అడ్డం పెట్టుకుని ఇతరుల గౌరవానికి భంగం కలిగిస్తున్నారని, ముఖ్యంగా ప్రజా జీవితంలో ఉన్న మహిళలను, సాధారణ మహిళలను కించపరిచేలా పోస్టులు పెడుతున్నారని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

# తగ్గిన బంగారం ధరలు

ముంబై కొంతకాలంగా నిలకడగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు ఇవాళ ఒక్కసారిగా కుప్పకూలాయి. అంతర్జాతీయంగా పలు అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ కీలకమైన లోహాల ధరలు తగ్గడం మార్కెట్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ రోజు బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. ఉదయం 10:30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1960 తగ్గి రూ. 1,61,680కి చేరుకుంది. అలాగే, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1800 తగ్గి రూ. 1,48,200 వద్ద నిలిచింది. దీంతో పసిడి కొనుగోలు చేయాలనుకునే వారికి కాస్త ఊరట లభించినట్లయింది.వెండి ధరలోనూ భారీ తగ్గుదల మరోవైపు వెండి ధరలోనూ భారీ తగ్గుదల నమోదైంది. ఇవాళ ఒక్కరోజే కిలో వెండిపై ఏకంగా రూ. 5 వేలు తగ్గింది. ఈ తగ్గుదల తర్వాత హైదరాబాద్‌లో కిలో వెండి ధర రూ. 2.90 లక్షలకు చేరగా, దేశ రాజధాని ఢిల్లీలో రూ. 2.80 లక్షలుగా ఉంది. స్థిరంగా సాగుతున్న ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గడంతో మార్కెట్లో ఆసక్తి నెలకొంది.

# ఎన్నికల హామీని నిలబెట్టుకున్న నారా లోకేష్

విజయవాడ మంగళగిరి నియోజకవర్గంలో మరో ఎన్నికల హామీ నిలబెట్టుకున్నారు ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. తన సొంత నియోజకవర్గంలోని తాడేపల్లి మహానాడు ప్రాంత ప్రజల దశాబ్దాల కలను నారా లోకేష్ నెరవేర్చారు. తాడేపల్లి పట్టణం సీతానగరం మహానాడు వద్ద రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మంత్రి లోకేష్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తాడేపల్లిలో ప్రకాశం బ్యారేజీ దిగువన 0.9 కి.మీ నుంచి 2.610 కి.మీల వరకు కృష్ణా నది కుడివైపు రూ.294.20 కోట్లతో వరద రక్షణ గోడ ను నిర్మించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంగళగిరి నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి లోకేష్ చర్యలు తీసుకుంటున్నారు. దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న ఈ ప్రాజెక్ట్ కు కేవలం ఏడాది కాలంలోనే రూ.294.20 కోట్ల పరిపాలన అనుమతులు సాధించడంతో పాటు టెండర్ ప్రక్రియను కూడా పూర్తిచేశారు.

భవిష్యత్ లో భారీ వరదలను దృష్టిలో పెట్టుకుని 15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని సైతం తట్టుకునేలా పటిష్టమైన డిజైన్ తో మహానాడులో రిటైనింగ్ వాల్ ను నిర్మించనున్నారుకేవలం సాధారణ గోడ కాకుండా భూమి లోపల 26 నుంచి 38 మీటర్ల లోతు వరకు 1,920 పైల్స్ వేయనున్నారు. పైల్- రాఫ్ట్ సాంకేతికతతో భూకంపాలతో పాటు నీటి ధృతిని తట్టుకునేలా నిర్మించనున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తైతే మహానాడు కాలనీ, సుందరయ్య నగర్ వంటి లోతట్టు ప్రాంతాల్లో నివసించే దాదాపు 50వేల మంది ప్రజలు వరద సమస్య నుంచి విముక్తి పొందుతారు. రాజధాని అమరావతి పరిధిలోని కీలక ప్రాంతాలకు, జాతీయ రహదారి-65కు రిటైనింగ్ వాల్ రక్షణగా నిలవనుంది.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీ దేవి, తాడేపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు దాసరి కృష్ణ, తాడేపల్లి టౌన్ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# భారీ నష్టాల్లో మార్కెట్లు

ముంబై అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా భారత స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీయడంతో దలాల్ స్ట్రీట్‌లో భారీ అమ్మకాలు వెల్లువెత్తాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,352.74 పాయింట్లు పతనమై 77,566.16 వద్ద స్థిరపడింది. అలాగే, ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 422.40 పాయింట్లు నష్టపోయి 24,028.05 వద్ద ముగిసింది.ముఖ్యంగా నిఫ్టీ తన ఆల్ టైమ్ హై నుంచి 10 శాతానికి పైగా పడిపోయి అధికారికంగా 'కరెక్షన్ జోన్'లోకి ప్రవేశించింది. జనవరి 5న నిఫ్టీ 26,373 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. అయితే, సెషన్ మధ్యలో ముడిచమురు ధరలు కాస్త తగ్గడంతో మార్కెట్లు ఇంట్రాడే కనిష్ఠ స్థాయిల నుంచి కొంతమేర కోలుకున్నాయి. కనిష్ఠ స్థాయి 23,868 నుంచి నిఫ్టీ 160 పాయింట్లు, 76,424 నుంచి సెన్సెక్స్ 1,142 పాయింట్లు రికవరీ అయ్యాయి.విస్తృత మార్కెట్లలో సైతం నష్టాలు తప్పలేదు. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.97 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 2.22 శాతం మేర క్షీణించాయి. ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ షేర్లలో తీవ్ర అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ అత్యధికంగా 3.97 శాతం పతనమైంది. మరోవైపు, ఐటీ రంగం మాత్రం సానుకూలంగా స్పందించి 0.08 శాతం స్వల్ప లాభంతో ముగిసింది.ప్రస్తుత పరిస్థితులపై మార్కెట్ నిపుణులు స్పందిస్తూ.. "నిఫ్టీకి 23,700?23,600 వద్ద తక్షణ మద్దతు లభిస్తుంది. ఒకవేళ ఆ స్థాయిని కోల్పోతే 23,400?23,300 వైపు పడిపోయే ప్రమాదం ఉంది. మార్కెట్ కోలుకోవాలంటే 24,300, 24,600 స్థాయిలను దాటాల్సి ఉంటుంది" అని వివరించారు. రాబోయే రోజుల్లో అమెరికా-ఇరాన్ పరిణామాలు, ముడిచమురు ధరల హెచ్చుతగ్గులపైనే మార్కెట్ కదలికలు ఆధారపడి ఉంటాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588